LN MEDIA PUBLICATION PVT LTD

MANA MI VARTA NEWS

@vaartanews @mvnewstv

www.mivaartanews.com

TGBIL/25/A0512

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

ఆదివారం

30 ఆగస్టు 2026

సూర్యాపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02

సంచిక :59

పేజీలు : 12 వెల : 5/-

వార్త

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం

కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు

91-8522888459 9515342857

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే



- వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: రాహుల్ డిమాండ్
- ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడంపై రాహుల్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరి అంటరానితనానికి మరో రూపం

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



- సరిహద్దు వెంబడి బలగాల ముమ్మర గాలింపు
- మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో డ్రోన్ గుర్తింపు
- సరిహద్దు దాటి పాక్ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి
- అనుమానాస్పద కదలికలపై ఉధంపూర్, కతువా, రాజౌరిలోనూ సెర్చ్ ఆపరేషన్లు



## మహా విధ్వంసం

- ప్రళయం మిగిల్చిన విషాదం
- సర్వం కోల్పోయి, గల్లంతైన ఆప్తుల కోసం అన్వేషిస్తున్న నేపాల్‌లోని కుటుంబాలు
- నేపాల్ ఆకస్మిక వరదలు
- 600 దాటిన మృతుల సంఖ్య
- శవాల ఫొటోల వద్ద కుటుంబాల రోదనలు
- మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి

# ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు



- సర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించండి
- అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా పోవద్దు
- అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదు
- సీఈసీకి రేవంత్ రెడ్డి లేఖ
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- ఎస్ఐఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపిన సీఎం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు మరో నాలుగు వారాలు సమయం ఇవ్వడంతో పాటు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ సవరించాలని సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కనీసం రెండు సార్లు గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటరు జాబితాను చదివి వినిపించాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా పోవద్దన్న సీఎం రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు - మిగతా9లో



## 'సర్' నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- బీఎల్వోలు ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా ఇవ్వాలని సీఈవో స్పష్టం
- రెండు రోజుల ముందు విచారణ ప్రాంతం, తేదీ, సమయం ఓటర్లకు తెలపాలి
- నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియలపై జిల్లాల కలెక్టర్లతో సీఈవో సుదర్శన్ రెడ్డి సమీక్ష

## బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

- భారత్ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచన
- భారత్‌లో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ వ్యాప్తి
- అంతలోనే బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇచ్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- భారత్ వన్ హెల్త్ విధానాన్ని బలోపేతం చేయాలని సూచించిన ఆరోగ్య నిపుణులు



## మహారాష్ట్ర సమ్మతి పొందడమే ప్రధాన లక్ష్యం



- సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేస్తోంది
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే ప్రధాన లక్ష్యం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతల అవసరం లేకుండా సహజ గురుత్వాకర్షణ ద్వారా సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుంది

హైదరాబాద్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుజ్జీవింపజేసి తెలంగాణ రైతులకు ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముం దడుగు వేస్తోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతల అవసరం లేకుండా సహజ గురుత్వాకర్షణ ద్వారా సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. సెప్టెంబర్ ఒకటిన కేంద్ర జల్‌శక్తి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య జరగనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ సచివాలయంలో ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు సమావేశంలో పాల్గొన్నారు. దిల్లీ సమావేశంలో రాష్ట్రం తరఫున వినిపించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన వాదనలు, - మిగతా9లో



## హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లో 195 హైరిస్క్ సరస్సులు
- బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు

# సెప్టెంబర్ 7నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి సమాచారం
- సెప్టెంబర్ 7నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- సభ్యులకు సమాచారం ఇచ్చిన శాసనసభ, శాసన మండలి కార్యదర్శులు
- ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రశ్నలు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి సూచన
- వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు



హైదరాబాద్

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉభయ సభల సభ్యులకు శాసనసభ, మండలి కార్యదర్శుల నుంచి అధికారికంగా సమాచారం అందింది. సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండా గా ఉంటాయి. వచ్చే నెల 2లోపు ఇవి అందించాలి వర్షాకాల - మిగతా9లో


సంపాదకీయం

# 8 రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు

హిమాలయాలు అంటే మంచు కొండలు. గ్లేషియర్లు. ప్రపంచంలోని కోట్లాది మందికి జీవనాధారం అందించే నదుల పుట్టినిల్లు. కానీ ఇప్పుడు ఇదే హిమాలయ ప్రాంతం వాతావరణ మార్పులతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. మంచు వేగంగా కరుగుతోంది. గ్లేషియర్లు వెనక్కి తగ్గుతున్నాయి. కొత్తగా ఏర్పడుతున్న హిమ సరస్సులు ఉబ్బిపోతున్నాయి. కొండచరియలు, మంచు చరియలు విరిగిపడి.. ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన ఘోర వరదలు ఈ ప్రమాద తీవ్రతను మరోసారి ప్రపంచం ముందు ఉంచాయి.హిమాలయాల్లో మంచు కరుగుతోంది. కొండలు అస్థిరమవుతున్నాయి. హిమ సరస్సులు పెరుగుతున్నాయి. ఆకస్మిక వరదల ముప్పు విస్తరిస్తోంది. నేపాల్–టిబెట్ సరిహద్దులో తాజా విషాదం ఒక ప్రాంతానికి మాత్రమే సంబంధించిన ఘటన కాదు. హిమాలయాలు వేడెక్కితే.. ఆ ప్రభావం పర్వతాల నుంచి మైదానాల వరకు.. నదుల నుంచి కోట్లాది ప్రజల జీవనంపై పడే అవకాశం ఉంది. హిమాలయాల్లో వరద పుట్టేది ఎత్తైన పర్వత ప్రాంతాల్లో.. మొదటి దెబ్బ తగిలేది గ్లేషియర్ దిగువన ఉన్న నదీ లోయలకు.. ఆ తర్వాత నదీ తీర గ్రామాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితమవుతాయి.. చివరికి నది ప్రవాహం దిగువ మైదాన ప్రాంతాలకు చేరుతుంది.అందుకే వరద పుట్టేది పర్వతాలపై.. మొదటి దెబ్బ నదీ లోయలకు.. తర్వాత నదీ తీర గ్రామాలకు.. చివరికి దిగువ మైదాన ప్రాంతాలకు అనే ప్రమాద గొలుసును ముందుగానే అర్థం చేసుకోవాలి.హిమాలయాల్లో వచ్చే వరదలకు భారతదేశంలో ప్రధానంగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు నేరుగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే వరద నీరు నదుల వెంట దిగువకు ప్రవహించడంతో పశ్చిమ బెంగాల్, అసోం వంటి మైదాన రాష్ట్రాలపైనా ప్రభావం పడొచ్చు.టిబెట్‌లో పుట్టే అనేక నదులు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి వచ్చిన తర్వాత సియాంగ్‌గా.. ఆపై అసోంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. మరోవైపు తీస్తా వంటి నదులు సిక్కిం, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల హిమాలయాల్లో వరద అంటే పర్వత ప్రాంతానికే పరిమితమైన సమస్య కాదు.. నదీ ప్రవాహం ఎక్కడివరకు వెళ్తుందో అక్కడివరకు ముప్పు విస్తరించే అవకాశం ఉంటుంది.నష్టం ఎంత ఉంటుందనేది వరద పరిమాణం, నది వెడల్పు, లోయ ఆకారం, దిగువన ఉన్న జనాభా, వంతెనలు, డ్యామ్‌లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగడంతో తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా భారీగా పెరిగింది. ఈ విపత్తులో ప్రాణ నష్టం సంభవించడంతో పాటు వంతెనలు, రహదారులు, భవనాలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1,200 మెగావాట్ల తీస్తా–ఎఎఎ జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు.చమోలీలో సంభవించిన ఆకస్మిక వరదలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు లేదా గల్లంతయ్యారు. జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు, నదీ లోయల్లోని మౌలిక సదుపాయాలు భారీగా దెబ్బతిన్నాయి. ఈ రెండు ఘటనలు చెబుతున్న సందేశం ఒక్కటే?ప్రాణ నష్టంతో పాటు విద్యుత్, రవాణా, వ్యవసాయం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థలపైనా భారీ ప్రభావం పడుతుంది.నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు, మట్టి ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. గ్లేషియర్‌లోని మంచు, రాళ్లు ఒక్కసారిగా కూలిపోయి భారీ నీటి ప్రవాహం ఏర్పడిందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. భోటే కోసి నది లోయలోకి దూసుకొచ్చిన వరదలు గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో విదేశీయులు, పర్యాటకులు, యాత్రికులు కూడా ఉన్నారు.ఈ ఘటనకు భూకంపమే కారణమన్న తొలినాటి అనుమానాలను తర్వాతి పరిశీలనలు బలపరచలేదు. గ్లేషియర్ కూలిపోవడం, మంచు–రాళ్ల ప్రవాహం, నదిలో ఒక్కసారిగా భారీ నీటి ఉద్ధృతి కలిసి ఈ విపత్తుకు కారణమైందని నిపుణుల అంచనాలు సూచిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు సహాయక చర్యలకు కూడా పెద్ద అవరోధంగా మారాయి.హిమాలయాల్లో ఇటువంటి విపత్తులు గతంలోనూ వచ్చాయి. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ ప్రాంతంలో మంచు–రాళ్ల ప్రవాహం, వరదలతో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగి గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 2024లో నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలతో వందల మంది మరణించారు. అదే ఏడాది నేపాల్‌లోని థామే ప్రాంతంలో గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ వచ్చి ఇళ్లు, హోటళ్లు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సహా అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. 2025లోనూ నేపాల్–టిబెట్ సరిహద్దులో భారీ వరదలు ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయి.హిమాలయాల ఎత్తు ప్రాంతాన్ని బట్టి భారీగా మారుతుంది. పర్వత పాద ప్రాంతాలు కొన్ని వందల మీటర్ల ఎత్తులో ఉండగా.. ఎత్తైన హిమాలయ ప్రాంతాల్లో 5,000 నుంచి 6,000 మీటర్లకు పైగా ఎత్తులు సాధారణం. ఎవరెస్ట్ వంటి శిఖరాలు 8,000 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.భారత్‌లోని హిమాలయ రాష్ట్రాల్లో అనేక పట్టణాలు, గ్రామాలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు నదీ లోయలకు సమీపంలోనే ఉన్నాయి. పర్యాటకం పెరగడం, రహదారులు విస్తరించడం, కొండ ప్రాంతాల్లో నిర్మాణాలు పెరగడం వల్ల ప్రమాద సమయంలో ప్రభావితమయ్యే ఆస్తుల విలువ కూడా పెరుగుతోంది. ఒక గ్లేషియర్ లేదా హిమ సరస్సు నుంచి అకస్మాత్తుగా నీరు విడుదలైతే.. అది కేవలం నీరు కాదు. నీటితో పాటు రాళ్లు, మట్టి, మంచు, చెట్లు, నిర్మాణాల అవశేషాలు కూడా దిగువకు కొట్టుకొచ్చే అవకాశం ఉంది. దీంతో సాధారణ వరద కంటే విధ్వంసకరంగా మారుతుంది.ఇలాంటి విపత్తులను పూర్తిగా ఆపడం సాధ్యం కాకపోయినా.. నష్టాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం సాధ్యమే. ప్రమాదకర హిమ సరస్సులను ఉపగ్రహాలు, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి. సరస్సుల్లో నీటి మట్టం, మంచు గోడల స్థిరత్వాన్ని కొలిచే సెన్సర్లను ఏర్పాటు చేయాలి. అత్యంత ప్రమాదకర సరస్సుల్లో అవసరమైన చోట నియంత్రితంగా నీటిని తగ్గించే చర్యలు చేపట్టాలి. అంతకంటే ముఖ్యంగా ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌లను బలోపేతం చేయాలి. ఎగువ ప్రాంతాల్లో ప్రమాద సంకేతాలు గుర్తించిన వెంటనే దిగువ గ్రామాలకు సైరన్లు, మొబైల్ అలర్టులు, రేడియో, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా సమాచారం చేరాలి.హిమాలయాలు భారత్, నేపాల్, భూటాన్, చైనా వంటి అనేక దేశాలకు సాధారణ సహజ వ్యవస్థ. ఒక దేశంలో గ్లేషియర్ కదలిక లేదా హిమ సరస్సు ఉప్పొంగడం మరో దేశంలోని నదీ ప్రవాహాన్ని ప్రభావితం చేయవచ్చు. అందుకే ఉపగ్రహ డేటా, వాతావరణ సమాచారం, హిమ సరస్సుల పరిస్థితి, నదీ నీటి మట్టాలు, వరద హెచ్చరికలను దేశాల మధ్య వేగంగా పంచుకునే వ్యవస్థ అవసరం. అదే సమయంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం, హిమాలయాల సున్నిత పర్యావరణ వ్యవస్థను కాపాడటం కూడా దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి.విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి. ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలను నియంత్రించి, దేశాల మధ్య సమాచారాన్ని పంచుకోవాలి. ఇవే హిమాలయ భవిష్యత్తును, అక్కడి ప్రజల ప్రాణాలను కాపాడే కీలక మార్గాలు.

# ఈ విలయం ఎవరి పాపం?

హిమవత్పర్వత శ్రేణి రాళ్లూ రప్పల సమూహం కాదు... అది ప్రకృతి చెక్కిన ఒక అద్భుత దృశ్యకావ్యం. ఈ సౌందర్యం కాస్తా రెప్పపాటులో మృత్యుగీతం ఆలపిస్తుంది. జనావాసాలను క్షణంలో శ్మశాన వాటికలుగా మారుస్తుంది. బుధవారం నేపాల్––టిబెట్ సరిహద్దుల్లో అతి పెద్ద మంచుఖండం విరిగి భోటే కోశీ నదిలో పడటంతో మెరుపు వరదలు సంభవించి 350 మంది వరకూ మరణించారని అంటున్నారు. 30కిపైగా దేశాలకు చెందిన 1,300 మంది గల్లంతయ్యారు. వారిలో 290 మంది భారతీయులు. నది దిగువనవున్న అనేక జనావాసాలు, డజను జలవిద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదార్లు కొట్టుకు పోయాయి. హిమాలయాల్లో ఇలాంటి ఉదంతాలు రివాజుగా మారినా, ఈసారి ఉత్పాతం అతి పెద్దదని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ దారుణానికి కారణమేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రిక్టర్ స్కేల్‌పై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించటంవల్లే ఇలా జరిగిందని తొలుత వార్తలొచ్చాయి. అయితే దాన్ని నిర్ధారించే ఉపగ్రహ చిత్రాలేమీ లేకపోవటంతో తీవ్ర వాతావరణ స్థితిగతులవల్లే మంచుఖండం కరిగి విరిగిపడి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరగటంవల్ల భూమి నానాటికీ వేడెక్కుతోంది. కాలుష్యకారక దేశాల్లో తొలి స్థానం అమెరికాది. అటు తర్వాత స్థానం చైనాది కాగా, మూడో స్థానం మనది. నాలుగో స్థానం యూరోప్ దేశాలది. కర్బన ఉద్గారాల విడుదలలో నేపాల్ స్థానం 95. అంటే ప్రపంచాన విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో ఒక శాతంలో పదో వంతు వాటా మాత్రమే నేపాల్‌ది. వాతావరణ మార్పుల తాకిడికి నష్టపోయే దేశాల్లో మాత్రం ఆ దేశానిది ఆరో స్థానం. అతి తక్కువ కాలుష్యానికి కారణమవుతూ అతి ఎక్కువ మూల్యం చెల్లిస్తున్న దేశంగా నేపాల్‌ను చెబుతారు. ఇప్పుడంటే సూపర్ ఎల్‌నినో వచ్చిపడిందిగానీ... గత దశాబ్దకాలంగా ప్రకృతి వైపరీత్యాలు వేధిస్తూనే ఉన్నాయి. వాటిని ముందుగా పసిగట్టే సాంకేతికతలు అనుకున్నంతగా అభివృద్ధి చెందకపోయినా, గతంతో పోలిస్తే ఎంతో మెరుగైన ఉపకరణాలు అమెరికా, చైనాలవద్ద ఉన్నాయి. తమ కారణంగా యేటా భారీ నష్టాన్ని చవిచూస్తున్న నేపాల్‌కు ఆ సాంకేతికతల్ని ఉచితంగా ఇచ్చి ఆదుకోవటం తమ నైతిక ధర్మమని అవి రెండూ అనుకోవు.



ఫలితంగా చెప్పాపెట్టకుండా మెరుపు వరదలు విరుచుకుపడటం నేపాల్‌లో మామూలు విషయంగా మారింది. భోటే కోశి నది టిబెట్‌లో మొదలవుతుంది. కొడారి దగ్గర ఒక పాయ, రసువా దగ్గర మరో పాయ నేపాల్‌లోకి ప్రవేశిస్తాయి. నిరుడు సైతం ఆ నదికి ఇలాగే వరదలొచ్చాయి. గత నెల 8న రసువా దగ్గరొచ్చిన వరదల్లో 18 మంది చనిపోగా, అనేక జలవిద్యుత్ ప్రాజె క్టులు, వంతెనలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. వర్షపాతం, వరదనీటి ప్రవాహాల గురించిన డేటా చైనా ఎప్పటికప్పుడు అందిస్తే ప్రాణనష్టాన్ని నివారించే వీలుంటుంది. దేశంలోకి వరద నీరు ప్రవేశించటం మొదలయ్యాకే పౌరుల్ని హెచ్చరించే స్థితి ఉండటం నేపాల్‌కి విషాదం మిగులుస్తోంది. కొన్నిసార్లు మంచుపలకలు విరిగి భోటే కోశి ప్రవాహ మార్గాన్ని కప్పేస్తాయి. అప్పుడు దిగువన నేపాల్‌లో నది నిండుకుంటుంది. దాన్నొక ముందస్తు హెచ్చరికగా తీసుకుంటారు. ఇలాంటి వైపరీత్యాలు జరిగినప్పుడు మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం తప్పదు. నిరుడు బేత్రావతి––రసువాగడి కారిడార్‌ను వరదలు ముంచెత్తి భారీ నష్టం జరిగింది. అతి కష్టంపై వాటన్నిటినీ పునర్నిర్మించారు. అవన్నీ తాజా వరదల్లో మళ్లీ కొట్టుకు పోయాయి. పదిపదిహేనేళ్ల డేటా అందుబాటులో ఉండి అధ్యయనం చేయగలిగితే నది నడత అంచనాకు, దానికి అనుగుణంగా కనిష్ఠ స్థాయి నష్టం మాత్రమే ఉండేలా నిర్మాణాలు చేపట్టడానికి కొంతవరకూ వీలవుతుంది. భారీ జననష్టం, ఆస్తినష్టం కలగజేసే వైపరీత్య సమాచారం సైతం సరిహద్దుల ఆవలే నిలిచిపోతే మానవాళి సాధించిన అభివృద్ధికి అర్థం ఉండదు. దానికన్నా ముందు సంపన్న దేశాలు తమ అభివృద్ధి నమూనాలను మార్చుకోవాలి. వైపరీత్యం వచ్చిపడ్డాక సాయం చేయటానికి ముందుకు రావటం మెచ్చదగిందే అయినా, దాని నివారణకు తమ వంతు చేయాల్సిందేమిటో అవి గుర్తెరగాలి. బాధ్యతారహిత ప్రవర్తన ఏదో ఒకరోజు తమను కూడా ధ్వంసించగలదని తెలుసుకోవాలి.

# ట్రంప్‌కు ఎదురుగాలి!

రెండో దఫా అధికార పీఠం అధిరోహించి కూడా రెండేళ్లు కావస్తున్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్‌కు దౌత్యనీతి ఒంటబట్టలేదు. తాను నిర్దేశించినదాన్ని అంగీకరించటమే తప్ప మరోవిధంగా మాట్లాడే హక్కు, అధికారం ఏ దేశానికీ లేదని ఆయన ఇప్పటికీ నమ్ముతున్నారు. ఆయన దృష్టిలో కేవలం అదే దౌత్యం. భారత్ నుంచి కెనడా వరకూ... ఇరాన్ నుంచి వెనిజులా వరకూ ఆయనది ఇదే బాణీ. ట్రంప్‌ను నేరుగా ప్రతిఘటించే వారుండొచ్చు, పరోక్షంగా చెప్పిచూద్దామనుకునే వారుండొచ్చు... మార్గాలు వేరైనా ట్రంప్ షరతులకు తలొగ్గబోమని చెప్పడమే వీరందరి సారాంశం. చాన్నాళ్లుగా విసుగెత్తి ఉన్నారేమో... కెనడా ప్రధాని మార్క్ కెర్నీ చాలా కరకుగానే వ్యవహరించారు. ఒకదాని వెంబడి మరో గొంతెమ్మ కోర్కెతో చీకాకుపరుస్తున్న అమెరికా తీరును నిరసిస్తూ వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగిస్తున్న తమ ప్రతినిధి బృందాన్ని వెనక్కురావాలని ఆదేశించారు. ఒప్పందం దాదాపు ఖరారై సంతకాలు జరపడమే తరువాయి అనుకునే దశలో ఎదురైన ఈ ఊహించని పరిణామం అమెరికాను అయోమయంలోకి నెట్టింది. ఇలాంటి భంగపాట్లే ఇరాన్ దగ్గర ఎదురయ్యాయి. మన దేశంతో చర్చలు ఒక కొలిక్కి వచ్చాయని అమెరికా అనేకమార్లు ప్రకటించింది. కానీ అదేమీ జరగలేదు. వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ తన సైన్య బలంతో ఈ ఏడాది మొదట్లో అపహరించి, అమెరికాలో ఆయనపై విచారణ తంతు సాగిస్తున్నారు. ఇకపై అది తమ భూభాగమని అమెరికా చెప్పడం ఆ దేశ ప్రజల్ని మాత్రమే కాదు... అత్యధిక దేశాలను ఆగ్రహోదగ్రుల్ని చేస్తోంది. ఇక



ఇరాన్ సంగతి చెప్పనవసరం లేదు. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపేశామని చెప్పటం నుంచి హోర్ముజ్ తమదేనని ప్రకటించటం వరకూ ట్రంప్ ఎన్ని చేసినా ఇరాన్ నిబ్బరంగా 'నీ లెక్కేమిట'న్నట్టే వ్యవహరిస్తోంది. మిత్ర దేశమైన దక్షిణ కొరియాదీ అదే వైఖరి. ఏటా 11 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలు ఉమ్మడి సైనిక విన్యాసాలు జరుపుతాయి. ఈసారి అయిదో రోజుకల్లా అమెరికా సైనికులు తట్టా బుట్టా సర్దుకుని తిరుగుముఖం పట్టారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌తో చెలిమి కోసం ట్రంప్ తహతహలాడటంపై ఆగ్రహించి దక్షిణ కొరియా ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఈ విన్యాసాల ఉద్దేశం ఉత్తర కొరియాను భయపెట్టడం. తీరా ఆ దేశంతోనే అమెరికా చేతులు కలుపుతుంటే... ఈ విన్యాసాలకు అర్థమేమిటన్నది దక్షిణ కొరియా ప్రశ్న. వాస్తవానికి ఉత్తర కొరియా పూర్తి స్థాయి అణ్వస్త్ర దేశంగా మారింది. ఆ దేశం దగ్గర 'చాలా శక్తిమంతమైన' ఆయుధాలున్నాయని ట్రంపే కొద్దికాలం క్రితం ప్రకటించారు. దాన్ని మరిచి కొత్త చుట్టరికాలు కలుపుకుందామని ట్రంప్ ప్రయత్నించినంత మాత్రాన ఆ దేశం నమ్మే అవకాశమేమీ లేదు. ఇరాన్‌తోసహా అన్ని దేశాలతోనూ దౌత్యపరంగా వరస వైఫల్యాలు తప్పడం లేదు గనుక ఉత్తర కొరియాకు దగ్గరై అమెరికా జనాన్ని ఆశ్చర్యపరచాలని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ వేరే దేశాలతో పెంచుకున్న వైరం వికటిస్తున్న విధంగానే ఉత్తర కొరియాతో చెలిమి సైతం బెడిసికొట్టే అవకాశం లేకపోలేదు. చివరకు ఉత్తర కొరియాఏం చేస్తుందన్నది అలావుంచితే... ఆసియా––పసిఫిక్ దేశాలన్నిటా ట్రంప్ అంతరంగంపై ఇప్పటికే ఉన్న సందేహాల్ని మరింతగా పెంచింది. ఈ దేశాలన్నీ చైనా దూకుడువల్ల చాలా ఇబ్బంది పడుతున్నాయి. ఇలాంటి సమయంలో తమకు అండగా నిలిచి, చైనాకు కళ్లెం వేయాల్సిన అమెరికా ఆడుతున్న వింతనాటకాలు వాటికి మింగుడుపడటం లేదు. అందుకే దక్షిణ కొరియా, జపాన్ ఇటీవల సాన్నిహిత్యమవుతున్నాయి. ఆ రెండింటిమధ్యా ఇబ్బందికర చరిత్రవున్నా ట్రంప్ వింత చేష్టలు వారిని సన్నిహితం చేశాయి. కెనడా ఉత్పత్తులపై 50 శాతం అదనపు సుంకాలు వేయాల్సివస్తుందని ట్రంప్ ప్రకటించగా, దానికి ప్రతిగా వచ్చే నెల 8 నుంచి అమెరికా ఉత్పత్తులపై 15 నుంచి 50 శాతం వరకూ సుంకాలు విధిస్తామని కెర్నీ ప్రకటించారు. అమెరికా అదనపు సుంకాల విలువ 2,000 కోట్ల డాలర్లయితే, కెనడా సుంకాలు 2,760 కోట్ల డాలర్లు. ఈ ప్రపంచం తనకు భయపడటం మాట అటుంచి... జాలి కూడా చూపబోదని ట్రంప్‌కు ఎంత త్వరగా తెలిస్తే అమెరికా ప్రజలకు అంత మేలు.

# వికసిత్ భారత్ సాధ్యమేనా!


మన చదువులు వర్తమాన అవసరాలకు తగినట్టు ఉండటం లేదని చాన్నాళ్లుగా నిపుణులు ఘోషిస్తున్నారు. చివరకు చదువయ్యాక అందించే నైపుణ్యాలు కూడా ఎందుకూ కొరగావటంలేదని తాజాగా నీతి ఆయోగ్ నివేదిక చెప్పడం ఆందోళన కలిగించే అంశం. దాని ప్రకారం ఉన్నత విద్యావంతుల్లో కేవలం 8.25 శాతం మందికి మాత్రమే విద్యార్హతకు తగిన ఉద్యోగం లభిస్తోంది. 2014––15 నుంచి ఇంతవరకూ రూ. 34,000 కోట్లు వెచ్చించి 7.67 కోట్లమందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చినా ఫలితం అంతంతమాత్రమేనని నివేదిక చెబుతోంది. 15––29 యేళ్ల మధ్యవయస్కులైన 8.7 కోట్లమందైతే చదువు, పని, శిక్షణల్లో అన్నింటికీ దూరంగా ఉండిపోయారంటున్నది. వీరు నిరుపేద వర్గాలవారు. మొన్న మార్చిలో విడుదలైన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ (పీఎల్ఎఫ్) సర్వే ప్రకారం యువతలో వీరు 25 శాతం. నైపుణ్యాభివృద్ధి గురించి మాట్లాడటం మొదలై రెండు దశాబ్దాలు దాటుతున్నా, ఆ కోర్సులపై తమకు స్పష్టత లేదని 40 శాతంపైగా యువత చెప్పారని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. ఇంత సమాచార లోపం ఉన్నప్పుడు ఎన్ని పథకాలు పెట్టి ఏం ప్రయోజనం?ప్రపంచ దేశాల్లో యువజనం అధికంగా గల దేశాల్లో భారత్ ఒకటి. మన జనాభాలో 65 శాతంమంది 35 యేళ్ల లోపువారు. సక్రమంగా వినియోగించుకోగలిగితే వీరు దేశానికి అపురూపమైన సంపద. ప్రపంచంలో చాలా దేశాలు వృద్ధ జనాభా ఎక్కువై దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. కానీ మనకు దండిగా యువత ఉన్నా వారికి ఉపాధి కల్పనలో విఫలమవుతున్నాం. ఏటా సమర్పించే వార్షిక బడ్జెట్‌లో గణాంకాలు ఘనంగా కనబడతాయి. కేటాయింపులు కళ్లు చెదిరేలా ఉంటాయి. కానీ ఫలితాలు చూస్తే ఇలా బావురుమంటాయి. ఉండాల్సినంత లేకున్నా ఉన్నత విద్యాసంస్థల విస్తరణ గతంతో పోలిస్తే పెరిగింది. ఈ సంస్థలు యేటా లక్షలాదిమంది పట్టభద్రుల్ని తయారుచేస్తున్నాయి. కానీ అభ్యసన ఫలితాలు గమనిస్తే అవి అంతంతమాత్రమనీ, ఉపాధి సామర్థ్య లోపాలు అపారమనీ నీతి ఆయోగ్ నివేదిక ఒకటి లోగడే చెప్పింది. చదువులో సమాన అవకాశాలు లేకపోవడం ఒక సమస్య అయితే... ఉత్పాదక ఉద్యోగాల కొరత ఏర్పడటం మరో సమస్య. ఈ సమస్యలపై లోతైన అధ్యయనం చేసి, సకాలంలో తగిన పరిష్కారాలు వెదకనట్టయితే అపురూప సంపదగా ఉండాల్సిన మన యువశక్తి కాస్తా ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లకు మూలకారణమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇన్ని లక్షలమంది ఉన్నత విద్యకెదిగారని అనుకోవటంవల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. వారికుండాల్సిన మౌలిక అభ్యసనాలు, నైపుణ్యాలు, ఉత్పాదకతకు తోడ్పడే ఉపాధి, నిరంతర నైపుణ్యాభివృద్ధి ఉంటేనే మానవ వనరుల్ని మనం సక్రమంగా వినియోగించుకుంటున్నట్టు లెక్క. మన నిరుద్యోగిత 2017––18లో 18 శాతం ఉంటే 2022––23 నాటికి అది 10 శాతానికి తగ్గిందని, నిలకడగా అక్కడే ఉందని గణాంకాలు చెబుతున్నాయి. వీరంతా 15––29 యేళ్ల మధ్యవయస్కులు. కానీ పట్టభద్రులు, అంతకు మించి చదివిన 25 యేళ్ల లోపువారిలో నిరుద్యోగిత 1983 నాటికి 35 శాతమైతే, 2023 కల్లా అది 39 శాతమైంది. అసలు నిరుద్యోగిత రేటు లెక్కగట్టే తీరే లోపభూయిష్టమైనది. ఉపాధి కోరుతున్నవారిలో లభించనివారి శాతమెంతో అది వెల్లడిస్తుంది. అధికారిక సర్వేల్లో నిరుద్యోగులుగా ఉన్న ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుంటారనుకోవటానికి లేదు. ఇక మహిళల్ని సర్వేలు సరిగా పరిగణనలోకి తీసుకోవటంలో విఫలమవుతున్నాయని తరచు ఆరోపణలొస్తుంటాయి. వారిని కూడా లెక్కేస్తే ఈ నిరుద్యోగ పటాలం అనూహ్యంగా ఉంటుంది. ఏ ఉద్యమాలు గాల్లోంచి పుట్టుకురావు. దేశాన్ని ఓ కుదుపు కుదిపిన జెన్ జీ ఉద్యమం కేవలం నీట్ ప్రశ్నపత్రాల లీకువల్లే వచ్చిందనుకోవటానికి వీల్లేదు. అది తక్షణ ప్రేరణ అయితే కావొచ్చుగానీ... చదువుకు తగిన ఉపాధి లభించకపోవటం, అసలు చదువులే ప్రామాణికంగా లేకపోవటం మన యువతను నిరాశానిస్పృహల్లో ముంచెత్తు తున్నది. వర్తమాన అవసరాలకు తగిన పాఠ్యాంశాలుండటం, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అలవర్చటం అవసరం. అలాగే డబ్బుకొద్దీ ప్రామాణిక విద్య అనే ధోరణి మారాలి. నీతి ఆయోగ్ నివేదికైనా ప్రభుత్వాల కళ్లు తెరిపించాలి. విధానాలు సరిచేసుకోవాలి.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# ఉప్పల్ ప్రజలకు నీలిమ హాస్పిటల్‌లో ఉచిత ప్రసవ సేవలు

--పల్లా రాజేశ్వర్ రెడ్డితో చర్చించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, ఆగస్టు 29 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరో కీలక ముందడుగు వేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నీలిమ హాస్పిటల్‌లో అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై చర్చించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఉచిత ప్రసవ (డెలివరీ) సేవలను ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.నీలిమ హాస్పిటల్‌లో ప్రస్తుతం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు కూడా వినియోగించుకునేలా ప్రత్యేక సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఇందుకోసం ఉప్పల్ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి లెటర్ ద్వారా సిఫారసు చేసే విధంగా అవకాశం కల్పించాలని పల్లా రాజేశ్వర్ రెడ్డిని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు కూడా నీలిమ హాస్పిటల్‌లో ఉచిత ప్రసవ సేవలు అందేలా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదుపాయం అమల్లోకి వస్తే ఉప్పల్ నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు గర్భధారణ, ప్రసవ సమయంలో అయ్యే వైద్య ఖర్చుల భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవానికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉన్న కుటుంబాలకు ఉచిత డెలివరీ సేవలు ఎంతో ఉపశమనం కలిగించనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలన్నదే తన లక్ష్యమని బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా వైద్య సేవలను పొందడంలో ఎవరూ ఇబ్బందులు పడకూడదని, పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటామని ఆయన అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు నీలిమ హాస్పిటల్ ద్వారా ఉచిత ప్రసవ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మహిళలకు, గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన నియోజకవర్గ ప్రజలకు సూచించారు.

# హబ్సిగూడలో అట్టహాసంగా నేషనల్ లెవెల్ కో-కో పోటీలు

---హబ్సిగూడలోని సెయింట్ జోసఫ్ స్కూల్ లో నేషనల్ లెవెల్ కో-కో పోటీలు

---ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేసిన శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి

----క్రీడాకారులను అభినందించిన హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ రెడ్డి






**హబ్సిగూడ, ఆగస్టు 29 ( మన మీ వార్త):**

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హబ్సిగూడలోని సెయింట్ జోసఫ్ స్కూల్ ఆద్వర్యంలో నిర్వహించిన సి ఐ ఎస్ సి ఈ గేమ్స్ ఢ స్పోర్ట్స్ 2026--కో-కో (బాయ్స్) నేషనల్ లెవెల్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ కె. శివసేన రెడ్డి హాజరై విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరై.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ చూపి ఫస్ట్ ప్రైజ్, సెకండ్ ప్రైజ్, థర్డ్ ప్రైజ్ సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ముందుకు సాగుతున్న ప్రతి విద్యార్థి అభినందనీయుడని తెలిపారు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉప్పల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ తో పాటు బీ ఎన్ రెడ్డి నగర్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ గణేష్ రెడ్డి, మెరుగు రమేష్ రెడ్డి, స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రంగనాథ్, స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ప్రేమ్, బాపి రెడ్డి, హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులు గుండు రాజన్న, మాలు నాయక్, సుమన్ నాయక్, వినోద్ నాయక్, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న బీరప్పగడ్డ డివిజన్

## అభివృద్ధి పనులతో నియోజకవర్గంలోనే నంబర్ వన్ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం: బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

**బీరప్ప గడ్డ, ఆగస్టు 29 ( మన మీ వార్త):**

బీరప్పగడ్డ డివిజన్‌లో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.బీరప్పగడ్డ డివిజన్‌లోని ఏఆర్‌కే రెసిడెన్సీ ఎదురుగా ఉన్న గల్లీలో శంకరయ్య కిరాణా దుకాణం (వరమ్మ ఇంటి) నుంచి ముదిరాజ్, గౌడ్ స్మశాన వాటిక వైపు వంజరి నర్సింగ్‌రావు ఇంటి వరకు సుమారు రూ.29 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎంఎంసీ అధికారులతో కలిసి బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని అన్నారు. డివిజన్ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, ఎంఎంసీ కార్పొరేషన్ అధికారులకు, ముఖ్యంగా జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో అవసరమైన నిధులను సమీకరిస్తూ బీరప్పగడ్డ డివిజన్‌ను నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కంటే మరింత అభివృద్ధి చేసి నంబర్ వన్ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.బీరప్పగడ్డ డివిజన్ ప్రజల తరఫున, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తరఫున ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.





ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంజరి నర్సింగ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, వంజరి బాలాజీ, తిరుపతి యాదవ్, వెంకట్‌రెడ్డి, బంటి గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, వరమ్మ, శంకరయ్యతో పాటు స్థానిక బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ శ్రీకృష్ణ నగర్‌లో అక్రమ అంతస్తులపై కొరడా

**పటాన్ చేరు ఆగస్టు 29 మీ వార్త ప్రతినిధి :**

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అంతస్తులను కొలిచివేసిన అమీన్పూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు





అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీకృష్ణ నగర్ కాలనీలో అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులకు మించి నిర్మించిన అంతస్తులను అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు.శ్రీకృష్ణ నగర్ కాలనీలో భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన అమీన్పూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగారు. సంబంధిత భవనాలను పరిశీలించిన అనంతరం, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులపై కొలతలు చేపట్టి అక్రమ నిర్మాణాల వివరాలను నమోదు చేశారు.అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందని, నిబంధనలను అతిక్రమించి భవనాలు నిర్మించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. భవన యజమానులు అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.బీరంగూడ శ్రీకృష్ణ నగర్‌లో అక్రమ అంతస్తులపై టౌన్ ప్లానింగ్ అధికారుల చర్య స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో అమీన్పూర్ సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇతర అక్రమ నిర్మాణాలపైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# మోడల్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నర్సంపేట, నెక్కొండ మండలాల్లో పర్యటించి మోడల్ హౌస్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మోడల్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశించిన సమయంలో పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా మోడల్ హౌస్ నిర్మాణాలు చేపట్టాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో రాంరెడ్డి, నర్సంపేట ఎంపీడీవో శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి.

**పరకాల ప్రతినిధి మన మీ వార్త**



నడికుడ మండలం నర్సక్కపల్లి గ్రామ బిఆర్ఎస్ నాయకులు,ఉప సర్పంచ్ వర్ధం శ్రీధర్ రెడ్డి తండ్రి వర్ధం సాంబరెడ్డి మృతిచెందగా నేడు వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.ఈ సందర్భంగా సాంబరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మన మీ వార్త ఆగస్టు29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో ౧+-ఞూూూ ద్వారా పారిశ్రామిక అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న అంశాలను వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.
ఇటీవల ౧+-ఞూూూ ద్వారా దరఖాస్తు చేసుకున్న 19 పరిశ్రమలకు సంబంధించి మొత్తం రూ.16.03 కోట్ల పెట్టుబడులతో 152 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు వివరించారు. ఆయా పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, క్లియరెన్స్‌లను నిబంధనల మేరకు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
అనంతరం ఫ్రా=×ణజు పథకం కింద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు చెందిన 9 వాహనాలకు రూ.31.52 లక్షల రాయితీని కమిటీ ద్వారా మంజూరు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పారిశ్రామిక ప్రోత్సాహక పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.
సమావేశంలో జి.ఎం ఇండస్ట్రియల్ నరసింహ మూర్తి ,లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవన్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చౌళ్ళపల్లి గ్రామంలో పర్యటించిన చల్లా..

- ఇటీవలే మృతిచెందిన కుటుంబాలను పరామర్శ...

**పరకాల ప్రతినిధి మన మీ వార్త**



ఆత్మకూరు మండలం చౌళ్ళపల్లి గ్రామంలో ఇటీవలే మృతిచెందిన మోర్తాల రాధాబాయి,కొనగాని చిన్న సమ్మయ్య,ఏరుకొండ పెద్ద కొమురయ్య కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. అదేవిధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ నాయకులు మోరె అరవింద్, గుర్రం సారయ్య కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు.కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళల అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బరోసా కల్పించారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 31, సోమవారం ప్రజావాణి రద్దు :: జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,

**మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



మహబూబాబాద్ సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపైన అత్యవసర సమావేశం జరగనుంది. జిల్లా యంత్రాంగం, జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున అందుబాటులో ఉండరు. కావున సోమవారం (అనగా) 31, కలెక్టరేట్లో జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ప్రజలు గమనించి ప్రజావాణి దరఖాస్తులతో కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలకు రావద్దని కోరారు.
జిల్లాలో మిగతా అన్ని చోట్ల యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

## హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి




మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

భారత హాకీ దిగ్గజం, హాకీ విజార్డ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత హాకీ రంగానికి ఆయన అందించిన సేవలు, దేశానికి సాధించిన విజయాలను స్మరించుకున్నారు.
క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.
క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు జిల్లాలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రీడాకారులను సన్మానించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యరాణి, ఆర్డిఓలు వరంగల్ సుమ, నర్సంపేట ఉమారాణి ఒలంపిక్ అసోసియేషన్ సెక్రెటరీ కైలాసం యాదవ్, డి వై ఎస్ ఓ అనిల్ కుమార్, అన్నీ మండలాల తాసిల్దార్లు కొచ్ లు కలక్టరేట్ స్టాఫ్ మరియు క్రీడకారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు రజిత రెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

హబ్సిగూడ, ఆగస్టు 29 ( మన మీ వార్త):





హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు రజిత రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆమె నివాసానికి వెళ్లి రజిత రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రజిత రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో, పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అభిలషించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. హబ్సిగూడ డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో రజిత రెడ్డి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు అభినందించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో సన్నిహితంగా మెలుగుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రజిత రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రజిత రెడ్డి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రజిత రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయత తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో సంతోషకరమైన వాతావరణంలో జరిగింది.

## నీట్ పీజీ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




మన మీ వార్త న్యూస్) : ఆగష్టు 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

నీట్ పీజీ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

**పరీక్ష కేంద్రాల తనిఖీ..**

అర్సపల్లిలోని ఏవీ ఎంటర్ ప్రైజెస్, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్?లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. సరిపడా కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.
నీట్(పీజీ) పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు నీట్ (పీజీ) పరీక్ష కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఈవో అశోక్, డీఐఈవో రవికుమార్, డీఎంహెచ్?వో రాజశ్రీ, ఏసీపీ ప్రకాశ్, తహశీల్దార్లు వినయ్ కుమార్, హరికిషోర్, కలెక్టరేట్ ఏవో బాలరాజు ఉన్నారు.

# పన్ను వసూళ్లలో వేగం పెంచండి - బల్దియా కమిషనర్ వెంకన్న

**- టాప్ డిఫాల్టర్ల పై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలి.....**

**- పన్ను బకాయిల వసూళ్లకు కఠిన చర్యలు తీసుకోండి....**

మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లకు నిర్దేశించిన లక్ష్యాల సాధనలో మరింత వేగం పెంచాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.
శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ట్యాక్సేషన్, రెవెన్యూ అధికారులతో ఆయన సర్కిల్‌ల వారీగా పన్నుల వసూళ్ల పురోగతిని సమీక్షించారు. ఆస్తి పన్నుల వసూళ్లు, కొత్త నిర్మాణాల గుర్తింపు, ప్రభుత్వ భవనాల రీ-అసెస్‌మెంట్, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాల పన్నుల విధింపు, అన్ కలెక్టబుల్ డిమాండ్లు, డబుల్ అసెస్‌మెంట్లు, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (యూ), ప్రాపర్టీ రివిజన్ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సర్కిల్, వార్డు స్థాయిలో విభజించి, రోజువారీ పురోగతిని తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు, వీఎల్‌టీ, డబుల్ అసెస్‌మెంట్లు, కమర్షియల్ భవనాల గుర్తింపు తదితర అంశాలపై రెవెన్యూ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పన్నుల అసెస్‌మెంట్, వసూళ్ల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం డిస్మాంటిల్ చేసిన భవనాలకు సంబంధించిన పాత హౌస్ నంబర్లను గుర్తించి, పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ వివరాలను ఉప కమిషనర్లు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, తుది నివేదికను సమర్పించాలని సూచించారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లకు ఆర్‌ఆర్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టేందుకు వివరాలను సమర్పించాలని తెలిపారు.
నగర పరిధిలోని ప్రతి ప్లాట్‌ను గుర్తించి నిబంధనల ప్రకారం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (VLT) వసూలు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.
పన్నుల వసూళ్లలో వెనుకబడిన సర్కిళ్లు, వార్డులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి బకాయిలను సేకరించాలని సూచించారు.
నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్య సాధన దిశగా సిబ్బందిని సమన్వయం చేయాలని ఆదేశించారు.
పన్ను వసూళ్ల లో వృద్ధిని పెంచడానికి త్వరలోనే వార్డు ఆఫీసర్ లు బిల్ కలెక్టర్ లు,రెవిన్యూ అధికారులతో సమన్వయం సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఆస్తి పన్ను తో సమాంతరం గా నీటి పన్ను బకాయి లపై దృష్టి సారించాలని ఈ సందర్భం గా కమిషనర్ అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి రామకృష్ణ, ఐటీ మేనేజర్ రమేష్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వరంగల్ ఫీజుల బకాయి - బీజేపీ లడాయి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మండిపాటు
- లక్షల మంది విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తున్న ప్రభుత్వం.
- రూ. 15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
-వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష.

మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు, ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ. 15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు.
-కనీసం విద్యాశాఖ మంత్రి కూడా లేని ఏకైక దుస్థితి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందంటూ ఆయన దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పక్షంలో ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేసే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.
-తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల, మరోవైపు ఆయుష్ వైద్య విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక వైఖరిని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు.
-కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద జీవో 97 వల్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, ఈసెట్ రాసే విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ఆందోళనలో పడిందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా విద్యా రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనపరుస్తోందని ధ్వజమెత్తారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు అత్యంత తక్కువ స్టైపెండ్ ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎండగట్టారు.
-విద్యార్థుల న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్రరావు గారిని అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, నిరసనలను పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని దుయ్యబట్టారు.
-ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మారలేదని, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. వెంటనే జీవో 97ను రద్దు చేయాలని, ఆయుష్ విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని గంట రవికుమార్ హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, బీజేపీ నాయకులు ఆడెపు రవిరాము, రాళ్లబండి మున్నా, మహంత్, బాశెట్టి సాయి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, , రాయపురం కుమారస్వామి, పోనుగోటి వెంకట్ రావు,అంకాల జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు తెకుమట్ల రేణుక, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మదాసు రాజు, ఓబిసి మోర్చా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, కర్నె రవీందర్, మెంతుల యాదగిరి, మార్తా ఉషారాణి, జీలకర్ర వీరస్వామి మరియు మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 31న "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమం

- రోస్టర్ విధానాన్ని సవరించి మాలలకు న్యాయం చేయాలి: డా. అల్లిబిల్లి మహేందర్

ఉప్పల్, ఆగస్టు 29 ( మన మీ వార్త):




విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ ఉత్సవాల కమిటీ కో-చైర్మన్, జాతీయ మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డా. అల్లిబిల్లి మహేందర్ తెలిపారు. జాతీయ మాల మహానాడు తెలంగాణ అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. అల్లిబిల్లి మహేందర్ మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రోస్టర్ విధానం కారణంగా మాలలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్ ప్రయోజనాలు సమర్థవంతంగా అందేలా రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించి, అవసరమైన మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
మాలల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమం కేవలం కొంతమంది నాయకులు, కార్యకర్తలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి మాల కుటుంబం నుంచి విద్యార్థులు, యువత, మహిళలు, పెద్దలు స్వచ్ఛందంగా తరలివచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత భవిష్యత్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై తమ హక్కుల కోసం గళం విప్పాలని కోరారు. ఉద్యోగాలు, విద్యా అవకాశాల్లో సమాన న్యాయం సాధించేందుకు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. మాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రోస్టర్ విధానంలో అవసరమైన సవరణలు చేయించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని డా. అల్లిబిల్లి మహేందర్ స్పష్టం చేశారు. ప్రతి మాల కుటుంబం నుంచి ప్రతినిధులు ఈ నెల 31న జరిగే "హలో మాల.. చలో సెక్రటేరియట్" కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మద్యం మత్తులో దాడి.. వ్యక్తి మృతి

**పాకాలలో ముగ్గురు నిందితుల అరెస్ట్**

**పాకాల :** మద్యం మత్తులో వ్యక్తిపై దాడి చేసి, అతడి మృతికి కారణమైన ముగ్గురు నిందితులను పాకాల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు.. ఆకుల కిరణ్ (33)కు నిఖిల్ (20), మహాసముద్రం రూపేష్ (20), పాకాల నరేష్‌రెడ్డి (24)తో గతంలో పరిచయం ఉంది. ఈ నెల 22న దామలచెరువు వైన్‌షాప్ సమీపంలో కిరణ్‌ను తమ వెంట తీసుకెళ్లిన నిందితులు మామిడి తోటలో మద్యం సేవించారు. అక్కడ గొడవ జరగడంతో కిరణ్‌ను వదిలి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి కుక్కలపల్లి సమీపంలోని మామిడికాయల ర్యాంపు వద్ద నిందితులు మద్యం సేవిస్తుండగా కిరణ్ అక్కడికి వచ్చి తనను పిలవకుండా మద్యం సేవిస్తున్నారంటూ వారితో గొడవపడ్డాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు అతడిపై చేతులు, కాళ్లతో దాడి చేసి ర్యాంపుపై నుంచి కిందకు తోసివేశారు. తీవ్రంగా గాయపడిన కిరణ్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. తొలుత హత్యాయత్నం కేసుగా నమోదు చేసిన పోలీసులు, కిరణ్ మృతి చెందడంతో హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాలతో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా, విశ్వసనీయ సమాచారంతో శనివారం ఉదయం 8.30 గంటలకు నేంద్రగుంట ఫ్లైఓవర్ వద్ద ముగ్గురు నిందితులను పాకాల సీఐ టి. చిన్న గోవిందు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లపై రేగొండ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు

పరకాల ప్రతినిధి మన మీ వార్త



రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కనిపర్తి గ్రామ శివారులో, మానేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రేగొండ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిలో 1.కుసుంబ రాకేష్ (26), కాకర్లపల్లి గ్రామం, తన ఖా 25 ఖీ 5390 ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.అలాగే 2.గొల్కొండ అనిల్ (22), నవాబ్‌పేట గ్రామం, చిట్యాల మండలం, ౧+ 25 7206 ట్రాక్టర్ ద్వారా, 3.పప్పు శ్రీనివాస్ (45), నవాబ్‌పేట గ్రామం, చిట్యాల మండలం, ౧+ 25 9275 ట్రాక్టర్ ద్వారా, 4.సమర్ల రాజు (26), రేపాక గ్రామం, రేగొండ మండలం, ఖా 25 ూా 3695 ట్రాక్టర్ ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నాలుగు ట్రాక్టర్లు మరియు వాటి ట్రాలీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తవ్వడం, తరలించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని రేగొండ పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేగొండ పోలీసులు హెచ్చరించారు.

## జనగామసోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు


- ప్రజలు తమ వినతులతో కలెక్టరేట్‌కు రావద్దు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మన మీ వార్త ఆగస్టు29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (ఆగస్టు 31)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు. అయితే డివిజన్ స్థాయి, మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో సమర్పించుకోవచ్చని సూచించారు.

## మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా దాసరి మహేష్ యాదవ్ నియామకం






బోడుప్పల్ సర్కిల్ ఆగస్టు 29 (మన మీ వార్త)

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందే శ్రీనివాస్ గారి చేతుల మీదుగా శనివారం రోజున దాసరి మహేష్ యాదవ్ మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ గా నియామక పత్రం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా దాసరి మహేష్ మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చిన జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొనె శ్రీనివాస్, రాష్ట్ర సీనియర్ నాయకులు ఏనుగు లక్ష్మయ్య, ఎండోమెంట్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్, డివిజన్ అధ్యక్షులు తలారి రవి యాదవ్ , సీనియర్ నాయకులు వేమునూరు మురళీధర్, సీనియర్ నాయకురాలు ఎస్ఎం ప్రగతి, భానుకుంట వేణుగోపాల్, గొల్లపూడి శ్రీనివాస్, తూప్పత్ ఆనంద్, లీలావతి, ఆదిమూలం రమాదేవి, రజకుమరి బొడ్డు సంధ్య , కాంత రెడ్డి , బజ్జురి శ్రీనివాస్, చంచల శివకుమార్, ఆర్ వేణుగోపాల్ బీజేవైఎం జనరల్ సెక్రెటరీ ధర్మపురి అరవింద్, నరేందర్ రెడ్డి, రాజు గౌడ్, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## ఆరు డీఏలు, పీఆర్సీ, ఈహెచ్ఎస్ అమలు చేయాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన




కాసిపేట, ఆగస్టు 29: (మన మీ వార్త మండల ప్రతినిధి)

ఆరు డీఏలు, పీఆర్సీ, ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎంపీడివో సత్యనారాయణ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయడంతో పాటు పీఆర్సీ అమలు చేసి, ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సౌకర్యాన్ని కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.

# బైకులు ఢీ... ఇద్దరికి తీవ్ర గాయాలు

- తాండా--తలుపునూరు మార్గంలో రోడ్డు ప్రమాదం
- మూడవత్ రెడ్యా నాయక్, రాహుల్‌కు తీవ్ర గాయాలు
- ఇద్దరినీ హైదరాబాద్ నిమ్స్‌కు తరలింపు
- రోహిత్‌కు స్వల్ప గాయాలు...వనపర్తి జనరల్ ఆస్పత్రిలో చికిత్స
- నిమ్స్‌లో బాధితులను పరామర్శించిన సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి నాయక్

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29 మీ వార్త :







తాండా--తలుపునూరు మార్గంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మూడవత్ రెడ్యా నాయక్, రాహుల్ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న రోహిత్‌కు స్వల్ప గాయాలు కావడంతో వనపర్తి జనరల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**ఎదురెదురుగా ఢీకొన్న బైకులు...**

స్థానికుల వివరాల ప్రకారం మూడవత్ రెడ్యా నాయక్ తాండా నుంచి తలుపునూరుకు బైక్‌పై వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన కాట్రావత్ రాహుల్, రోహిత్ మరో బైక్‌పై తలుపునూరు నుంచి తాండాకు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రెండు బైకులు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో మూడవత్ రెడ్యా నాయక్‌తో పాటు కాట్రావత్ రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రోహిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

**ఇద్దరినీ నిమ్స్‌కు తరలింపు...**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మూడవత్ రెడ్యా నాయక్‌ను తొలుత వనపర్తి జనరల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.అదేవిధంగా కాట్రావత్ రాహుల్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో వనపర్తిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇద్దరూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

**రోహిత్‌కు స్వల్ప గాయాలు...**

ప్రమాదంలో గాయపడిన రోహిత్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. అతడిని వనపర్తి జనరల్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా లేదని తెలిసింది.

**నిమ్స్‌లో పరామర్శించిన తిరుపతి నాయక్...**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మూడవత్ రెడ్యా నాయక్,కాట్రావత్ రాహుల్‌లను సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి నాయక్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరినట్లు సమాచారం. బాధితుల కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**బాధిత కుటుంబాలకు అండగా నాయకులు...**

ఈ సందర్భంగా తాండా సర్పంచ్ శ్రీను నాయక్, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బాలునాయక్ తదితరులు కూడా నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి మూడవత్ రెడ్యా నాయక్‌ను పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.కుటుంబంలో ఆందోళన,మూడవత్ రెడ్యా నాయక్ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మెరుగైన వైద్యం అందించి ఆయనను కాపాడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు...

**ప్రమాదంతో ఆందోళన...**

తాండా--తలుపునూరు మార్గంలో జరిగిన ఈ ప్రమాదంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. ఒకే ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బాధితులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు...

# హనుమకొండ క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయి







మన మీ వార్త ఆగస్టు29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండలో ఘనంగా బ్యాడ్మింటన్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవం

విద్య, వైద్యంతో పాటు క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ లిపశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ లో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో,జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలమాల వేశారు.

ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ జేఎన్ఐఎస్ ప్రెసిడెంట్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సభాధ్యక్షత వహించగా ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని అన్నారు. గత రెండున్నరేళ్లలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. జేఎన్ఎస్ లో కల్పించిన క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సూచించారు.

క్రీడాకారులకు అవసరమైన మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు.

వరంగల్ క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందని, ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది క్రీడాకారులు గతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు.

ప్రస్తుత తరం క్రీడాకారులు కూడా క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

క్రీడల్లో సాధించే ప్రతి విజయం వ్యక్తిగత విజయంతో పాటు కుటుంబానికి, ఊరికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

క్రీడాకారులు తమ ప్రతిభతో హనుమకొండ జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన రోజే మాకు నిజమైన బహుమతి అని అన్నారు.

హనుమకొండలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవన నిర్మాణం వంటి చర్యలు భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దోహదపడనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

జేఎన్ఎస్‌లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లలో క్రీడా వసతులను మెరుగైన ప్రమాణాలతో అభివృద్ధి చేశామని తెలిపారు.

క్రీడాకారులు ఈ సదుపాయాలను తమ సొంత ఆస్తిగా భావించి సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు కూడా సహకరించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ప్రత్యేక భవనం నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేశామని, ఈ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలకే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

యువ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వసతులు అందించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

హనుమకొండ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ మాట్లాడుతూ దాదాపు కోటిన్నర రూపాయలతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణముతో నిర్మించిన వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్, స్విమ్మింగ్ అకాడమీ క్రీడాకారులు స్విమ్మింగ్ చేయగా ఎంపీ ఎమ్మెల్యే కలెక్టర్లు పరిశీలించారు.

బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఏసిపి జితేందర్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు.

బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసం లను ఎమ్మెల్యే కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీభద్రకాళీ దేవస్థానమును ఈ రోజు సౌత్ సెంట్రల్ రైల్వే జి.ఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆలయాన్ని సందర్శించారు.

మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





ఆలయానికి విచ్చేసిన జి.ఎం కి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యవమున అర్చకులు జిఎం శ్రీ సంజయ్ కుమార్ వాస్తవ గారికి మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు, చిత్రపటమును బహూకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం భద్రకాళి అమ్మవారి విగ్రహము లేదా చిత్రపటమును కాజీపేట మరియు వరంగల్ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయుటకు ఆలయ అధికారులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఎం. రామకృష్ణారావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం రామకృష్ణారావుకు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు. రామల సునీత కార్యనిర్వహణాధికారి

# వీర నారాయణపూర్ అభివృద్ధికి అవసరమైన అన్ని పనులు పూర్తి చేస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నాం - మంత్రి పొన్నం ప్రభాకర్

మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ జిల్లా : ఎల్కతుర్తి మండలం ,వీర నారాయణపూర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండలం వీర నారాయణపూర్ గ్రామంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక, మౌలిక వసతులకు సంబంధించిన వినతిపత్రాలను మంత్రి స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వీర నారాయణపూర్ ప్రగతి నివేదిక

ప్రజా పాలన ప్రభుత్వంలో వీర నారాయణపూర్ గ్రామానికి పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయని మంత్రి తెలిపారు.

- గ్రామంలో 97 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అధిక శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. త్వరలో రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నాం.
- 180 మంది పెన్షన్‌దారులకు రూ.1.40 కోట్లు విడుదల చేస్తున్నారు.
- గృహజ్యోతి పథకం ద్వారా 276 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.25.76 లక్షల లబ్ధి చేకూరింది.
- మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 229 కుటుంబాలకు రూ.5.45 లక్షలు విడుదల చేశారు.
- 20 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.10.09 లక్షలు విడుదల చేశారు.
- 20 మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.2.82 కోట్లు అందించారు.
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, ఒక్కో కిట్‌లో 13 రకాల వస్తువులు అందించారు.
- 173 మంది రైతులకు రూ.1.37 కోట్లు అందించారు.
- 360 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1.83 కోట్లు విడుదల చేశారు.
- ఇద్దరు రైతుల కుటుంబాలకు రైతు బీమా కింద రూ.10 లక్షల చెక్కులు అందించారు.
- 142 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.37.76 లక్షలు విడుదల చేశారు.
- 18 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందించారు.
- 69 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.
- గ్రామంలోని 382 రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.
- 11 భూభారతి దరఖాస్తులు నమోదు కాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.





గ్రామ అభివృద్ధికి సర్పంచ్ ప్రతిపాదించిన పనులు

గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన మాటను మంత్రి పొన్నం ప్రభాకర్ నిలబెట్టుకుంటున్నారని గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు అన్నారు. గత ఏడాది కాలంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

వాటర్ ప్లాంట్ నుంచి బస్‌స్టాండ్ వరకు సీసీ రోడ్డు, అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం పూర్తి చేయడం, నూతన మంచినీటి బావి, పోచమ్మ గుడి నుంచి సీసీ రోడ్డు, వాగులో రెండు చెక్‌డ్యాంలు, డంపింగ్ యార్డు, చెక్‌డ్యాం తర్వాత రోడ్డు, వాటర్ ప్లాంట్ నుంచి దగ్గుపల్లి వరకు విద్యుత్ స్తంభాలు, మెటల్ రోడ్డు, అంతర్గత సీసీ రోడ్లు, కోతుల నడుమ నుంచి హుజురాబాద్ వెళ్లే మార్గంలో దండేపల్లి వరకు రోడ్డు బ్రిడ్జి పూర్తి చేయాలని కోరారు.

వీర నారాయణపూర్ - దండేపల్లి బ్రిడ్జి రోడ్డు మంజూరు

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వీర నారాయణపూర్ నుంచి దండేపల్లి వరకు బ్రిడ్జి రోడ్డు ఇప్పటికే మంజూరైందని తెలిపారు. గ్రామంలో అవసరమైన సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనానికి అదనపు నిధులు, మంచినీటి బావి తదితర పనులను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

"వీర నారాయణపూర్ గ్రామానికి కావాల్సిన అన్ని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి స్పష్టం చేశారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

జలసిరి పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షల వరకు సహాయం అందిస్తుందని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి స్టీల్ బ్యాంక్‌లను వినియోగించాలి

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గ్రామాల్లో స్టీల్ బ్యాంక్‌లను విస్తృతంగా వినియోగించాలని మంత్రి కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని తెలిపారు. వీర నారాయణపూర్‌లో మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు అందించామని, ఒక్కో హోటల్‌కు 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు తెలిపారు.

కొత్తగా పెన్షన్ల కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తులు

కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 31 వరకు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్‌ఐవీ బాధితులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

14--15 సంవత్సరాల వయసున్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకాలు వేయించాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి వాటిని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

యువత క్రీడల వైపు అడుగులు వేయాలి

నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించామని, గ్రామాల్లో క్రీడా సామగ్రిని అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే మంచి గుర్తింపు రావడంతో పాటు, క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. ముఖ్యంగా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖల్లో అవకాశాలు పొందేందుకు క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు.

"విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా మైదానాలకు వెళ్లాలి. వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పాల్గొనాలి" అని మంత్రి సూచించారు. ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రజా పాలనలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని వివరించారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని, మహిళా సంఘాల రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించిన ఇనుగాల



హనుమకొండ డి సి సి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరామర్శించారు
లక్ష్మీపురం గ్రామానికి చెందిన చిలివేరు సాంబయ్య స్వర్గస్థులవ్వగా.. వారి అంత్యక్రియల్లో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.
సాంబయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు.

పరకాల ప్రతినిధి మన మీ వార్త

నాగారం గ్రామంలో:నాగారం గ్రామానికి చెందిన చిట్టిరెడ్డి మల్లా రెడ్డి , చిట్టిరెడ్డి ప్రతాప్ రెడ్డి ఇటీవల మరణించగా.. వారి నివాసాలకు వెళ్ళి మరణించిన వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

- ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయండి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మంత్రి సీతక్క విజ్ఞప్తి

మన మీ వార్త ఆగస్టు29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర హైదరాబాద్, ఆగస్టు 29: ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కోరారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఆమె భేటీ అయ్యారు. ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో డ్రైనేజీ, పారిశుద్ధ్య పనుల కోసం అత్యవసరంగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఓపీ (ఔట్ పేషెంట్) గదుల నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి నిర్వహణ, సేవల మెరుగుదలకు 50 మంది ×ఖీమీా వర్కర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు రూ.1.20 కోట్ల నిధులు కేటాయించాలని మంత్రి సీతక్క కోరారు. 132 టెక్నికల్ పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 14 మంది పనిచేస్తున్నారని, మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు అత్యవసరంగా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల సౌకర్యార్థం అత్యవసరంగా ర్యాంప్ ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే 5 నుంచి 10 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కంటి సంబంధిత శస్త్రచికిత్సల కోసం క్రిటికల్ కేర్ బ్లాక్‌లో అధునాతన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలంటే ఆసుపత్రిలో ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేక వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి. ములుగు వంటి ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ వ్యాధులపై ప్రత్యేక అధ్యయనం, నిర్ధారణ, చికిత్స కోసం ములుగు జిల్లాలో ఒక ప్రత్యేక రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో కనిపించే ప్రత్యేక ఆరోగ్య సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, బాధితులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ పరిశోధన కేంద్రం ద్వారా ఆదివాసీ గిరిజనుల ఆరోగ్య పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి, దీర్ఘకాలిక వైద్య కార్యాచరణ రూపొందించవచ్చని తెలిపారు.

ములుగు జిల్లా ప్రజలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి సీతక్క వినతిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. సంబంధిత అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## బోర్గాం(పి) స్కూల్ మైదానాన్ని విస్తరించేందుకు కృషి చేస్తాం: కలెక్టర్

(మన మీ వార్త న్యూస్) : ఆగస్టు 29, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి) బోర్గాం(పి) స్కూల్ మైదానాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం పాఠశాలను సందర్శించారు.

**పాఠశాలకు ప్రశంసలు..**

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బోధనా సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120 మంది విద్యార్థులు చదువుకోవడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు రావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్?కుకు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ భవేశ మిశ్రా పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల





నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు పరీక్ష..**

ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతిని సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్? సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట డీఈవో అశోక్, మోపాల్ తహశీల్దార్ రేఖ, ఎంఈవో సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ నవ్య నాగరాజు గౌడ్.

మనోహరాబాద్ మన మీ వార్త ప్రతినిధి ఆగస్టు 29



మండల పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీ కాళ్ళ కల్ సర్పంచ్ నవ్య నాగరాజ్ పంచాయతీ వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఆర్ఐ కిషోర్ రేషన్ షాప్ డీలర్లు ముత్యం ప్రభాకర్,అచ్చ గౌని సత్యనారాయణ గౌడ్, గ్రామస్తులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులు అవుచున్నారని సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జూపల్లి మల్లారెడ్డి మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి నరసింహ సీనియర్ నాయకుడు దండు సత్యనారాయణ,కొత్తకాపు శ్రీనివాస్, లద్దిపీర్లా శ్రీనివాస్ గౌడ్, కనిగిరి నరసింహ వార్డు సభ్యులు వర్గంటి రాజశేఖర్ రెడ్డి, గుజ్జుల స్వామి, కనిగిరి అనసూయ, ఎండి ఇర్ఫాన్, గ్రామ ప్రజలు రైతులు యువకులు పాల్గొన్నారు.



## కౌకూర్ మోడల్ మార్కెట్ భవనం కోసం మూడో రోజు ధర్నా....

- ప్రజా ప్రయోజనాలకే మోడల్ మార్కెట్ భవనం -- ఎక్సైజ్ శాఖ కోసం కాదు!





**కౌకూర్ ఆగస్ట్ 29: (వార్త ప్రతినిధి)**

కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ శాఖకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజల అవసరాల కోసం వినియోగించాలని డిమాండ్ చేస్తూ మూడో రోజు ధర్నా కార్యక్రమం కొనసాగింది. కౌకూర్ ప్రజలకు అవసరమైన వీవీజ వార్డు కార్యాలయం, జిమ్/వ్యాయామశాల, శానిటేషన్ స్టోర్ రూమ్, స్ట్రీట్ లైట్స్ మెటీరియల్ స్టోర్ వంటి ప్రజా సేవా కేంద్రాలను మోడల్ మార్కెట్ భవనంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన భవనాన్ని ఎక్సైజ్ శాఖకు కేటాయించడాన్ని వెంటనే పునఃపరిశీలించి, కౌకూర్ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తుడిమెళ్ల మల్లికార్జున్, శివరాజ్, చందు, నక్క శివ, అజయ్ జోండలే, ఆరిఫ్, హేమంత్, రవీందర్, వినోద్, సాయి కుమార్, రాజ్ కుమార్, అజయ్, రాజేష్, అర్జున్, వరుణ్, సాయి, మారుతి, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## NEET (PG) పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 దీచీూ అమలు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు, పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్

- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐ.పి. ఎస్



**మన మీ వార్త ఆగస్టు29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ఆగస్టు 30 వ తేదిన వరంగల్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించే చీజుజు (గ+) -2026 పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 దీచీూ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ శ్వేత ఐపిఎస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.ం

## దేవాపూర్‌లో ఎస్ఐఆర్ గ్రామసభ



**కాసిపేట, ఆగస్టు 29:(మన మీ వార్త మండల ప్రతినిధి)**

కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఎస్ఐఆర్ కు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. బీఎల్ఓ--05, బీఎల్ఓ--06 పరిధిలోని ఓటర్లకు సంబంధించిన అంశాలపై గ్రామసభలో చర్చించారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, ఓటర్ల జాబితా పరిశీలన తదితర అంశాలపై అధికారులు గ్రామస్తులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో దేవాపూర్ గ్రామ సర్పంచ్ సీడం రాందాస్, , ఎంఆర్వో సునీల్ కుమార్ దేశ్ పాండే , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జీపీవో, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు బీఎల్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి..

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మన మీ వార్త ఆగస్టు 29 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం





నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సమగ్ర ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో SIR ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో మొత్తం 1,94,399 నోటీసులు జనరేట్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 11,173 నోటీసులు సంబంధిత ఓటర్లకు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన జారీ చేసి, SIR ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలతో నిర్ణీత గడువులోగా సంబధిత ఇ ఆర్ ఓ., ఏ.ఇ.ఆర్.ఓ కార్యాలయాల లో సమర్పించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డి విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ,నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఎలక్షన్ సూపరిండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

# పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా రాఖీ వేడుకలు

- పోలీస్ కుటుంబంలో వెల్లివిరిసిన ఆత్మీయత
- సోదరభావానికి ప్రతీకగా రాఖీ సంబరాలు
- ఎస్సై కురుమయ్యకు రాఖీ కట్టిన మహిళా కానిస్టేబుల్ దీపిక

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 29 మీ వార్త**

పాన్‌గల్ : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్సై కురుమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ దీపిక,ఎస్సై కురుమయ్యతో పాటు తోటి పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టారు. అనంతరం స్వీట్లు పంచి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో కొద్దిసేపు పండుగ వాతావరణం నెలకొంది,ఐకమత్యమే బలం.



ఈ సందర్భంగా ఎస్సై కురుమయ్య మాట్లాడుతూ... రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది కుటుంబ సభ్యుల మాదిరిగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు.ప్రజాసేవలో ముందుండాలి,పోలీస్ సిబ్బంది ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎస్సై కురుమయ్య ఆకాంక్షించారు. విధి నిర్వహణలో పరస్పరం సహకరించుకుంటూ స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని అన్నారు.

**పోలీస్ కుటుంబంలో ఆత్మీయత...**

రాఖీ వేడుకలు పోలీస్ సిబ్బంది మధ్య సోదరభావాన్ని, ఆత్మీయతను మరింత పెంపొందించాయని తెలిపారు. ఎస్సై కురుమయ్యకు రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుల్ దీపిక.పోలీస్ కుటుంబంలో ఐకమత్యం, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

# మంత్రి జూపల్లికి రాఖీ కట్టిన సీతక్క

- రక్షాబంధన్ వేడుకల్లో ఆత్మీయత వెల్లివిరిసింది
- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 29 మీ వార్త**

రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుతూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఆత్మీయ బంధంతో ఆనందం,రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి సీతక్క.. మంత్రి జూపల్లి కృష్ణారావుకు రాఖీ కట్టి తన ఆప్యాయతను చాటుకున్నారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధం, పరస్పర



గౌరవానికి ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకను ఆత్మీయంగా నిర్వహించారు.అనుబంధాన్ని చాటిన రాఖీ, రాజకీయాలకు అతీతంగా సోదర, సోదరీమణుల మధ్య ఉండే ఆత్మీయ బంధాన్ని రాఖీ పండుగ మరోసారి చాటింది. మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క రక్షాబంధన్ సందర్భంగా ఆత్మీయంగా కలుసుకుని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. రాఖీతో వెల్లివిరిసిన సోదరభావం...రక్షాబంధన్ పండుగ సందర్భంగా రాఖీ కట్టడం ద్వారా సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్, ప్రేమ, ఆప్యాయత, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా మంత్రుల మధ్య ఆత్మీయత వెల్లివిరిసింది. రాఖీ వేడుకలో భాగంగా మంత్రి సీతక్క మంత్రి జూపల్లి కృష్ణారావుకు రాఖీ కట్టి ఆనందాన్ని పంచుకున్నారు...

# 22 ఏ నిషేధిత జాబితా నుంచి పటాన్ చేరు నియోజకవర్గ భూములను తొలగించాలి

- మాజీ మంత్రి,బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.హరీష్ రావు..
- పటాన్చెరువు నియోజకవర్గంలో 50565 ఎకరాలు పెట్టారని ఆగ్రహం
- ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తుంటే మాపై కేసులు పెడుతున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

**పటాన్ చేరు ఆగష్టు 29 మీ వార్త ప్రతినిధి :**

పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం జరిగిన 22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ బాధితులకు న్యాయంచేయాలని, అమీన్‌పూర్‌లోని భూములను వెంటనే 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి. హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల బాధితులతో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన నిరసన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రజలకు ఇల్లు అంటే జీవితకాల భరోసా అని, కానీ నేడు ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఆ భరోసానే ప్రశ్నార్థకంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. “ఇల్లు అంటే ఒక భరోసా.. కానీ పిచ్చోడి చేతిలో రాయి అన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది” అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 50,565 ఎకరాల భూమిని







నిషేధిత జాబితాలో పెట్టారని ఆయన ఆరోపించారు. నిజమైన భూ హక్కుదారుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోందన్నారు. కబ్జాదారుల నుంచి ప్రజల భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇప్పుడు బాధితుల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.“ప్రభుత్వం కబ్జాదారుల నుంచి ప్రజలను కాపాడాల్సింది పోయి, భక్షకులుగా మారింది” అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పటాన్‌చెరు ప్రాంతంలో జీవో 58 కింద 9 వేల మందికి పట్టాలు అందించామని గుర్తు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, భూ హక్కులు కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు

ప్రస్తుతం 22ఏ పేరుతో ప్రజల భూములు, ఆస్తులపై ఆంక్షలు విధించడం వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.



సంవత్సరాల క్రితం చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల బాధితులు రిజిస్ట్రేషన్లు, విక్రయాలు చేసుకోలేక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.అమీన్‌పూర్‌తో పాటు పటాన్‌చెరు నియోజకవర్గంలోని అర్హులైన నిజమైన భూ హక్కుదారుల భూములపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, అన్యాయంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలగించాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.“22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను వెంటనే తొలగించాలి. లేకుంటే భూ బాధితులందరినీ ఏకం చేసి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం” అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలిచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.

# మహా విధ్వంసం

ఆసుపత్రుల వెలుపల గోడలకు అంటించిన మృతుల ఫొటోలను చూస్తూ కన్నీరుమున్నీరు అవుతున్న జనాలు. తమ సామగ్రి కోసం బురదలో, శిథిలాల మధ్య వెతుకుతున్న కుటుంబాలు. దెబ్బతిన్న భవనాల గుండా పసిబిడ్డను ఎత్తుకొని వెళ్తున్న ఓ బాధిత మహిళ. శిథిలాల మధ్య పడి ఉన్న ఓ కుక్క కళేబరం. నేపాల్?ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు సృష్టించిన బీభత్సానికి ఇవి కొన్ని సజీవ సాక్ష్యాలు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి బంధువుల్లో ఆశలు ఆవిరి అవుతున్నాయి. మరోవైపు సహాయక బృందాలు అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ ప్రాణాలకు తెగించి బాధితుల కోసం గాలిస్తున్నాయి. బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు ఒక్కసారిగా గ్రామాలు, పట్టణాలను ఊడ్చేసింది. వరద ఉధృతికి ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పెను విపత్తు నుంచి కోలుకోవడానికి ఇప్పుడు నేపాల్ తీవ్రంగా శ్రమిస్తోంది.



**భారీగా పెరిగిన మృతుల సంఖ్య**

శనివారం నాటికి నేపాల్‌లో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. పైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తరచూ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ బృందాలు ఎంతో శ్రమించి 163 మంది విదేశీయులతోపాటు, దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. తమకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారేమోననే ఆశతో పేర్లు, ఫొటోలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. బతికున్న వారి జాబితాలో తమ వారి పేర్లు కనిపించకపోవడంతో, భారమైన హృదయంతో, మరణించిన వారి ఫొటోలు ఉన్న మరో జాబితా వైపు వెళ్తున్నారు. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు చూపరులను కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా, బురదను తప్పుకుంటూ గల్లంతైన వారి కోసం అన్వేషిస్తున్నారు.

అప్పర్ త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అక్కడ టన్నుల కొద్దీ బురద పేరుకుపోయింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లైన్లతో ఆ బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఆ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్?లైన్ ఖబర్? అనే న్యూస్ పోర్టల్ పేర్కొంది.

మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో విధ్వంసం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో మునిగిపోయాయి. వాహనాలు సగం వరకు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. ఇక ప్రాణాలతో బయటపడిన వారికి, ఉండడానికి ఓ చోటు, వైద్యం, పోయిన సామగ్రి వెతుక్కోవడం కష్టమైపోతోంది. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల గుండా నడుస్తూ తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఒక వ్యక్తి శిథిలాల గుండా గ్యాస్ సిలిండర్? మోసుకెళ్తున్నాడు. ఎందుకంటే అతను ఆ ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అది ఒక్కటే. ఎక్కడ చూసినా దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలు కనిపిస్తున్నాయి. ఇది వరద సృష్టించిన మహా విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ బాధితులకు కాస్త ఆసరాగా మారింది. ఆర్మీ సిబ్బంది పిల్లలకు, వృద్ధులకు సాయం చేస్తున్నారు. వైద్యులు తాత్కాలిక వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్యాంప్?ల్లోనే గల్లంతైన, మరణించిన, రక్షించబడిన వారి వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం 11వేల మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు.

**మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!**

వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ఇది రెస్క్యూ సిబ్బంది పనిని మరింత కష్టతరం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, గతంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కొన్న అనుభవంతో, గల్లంతైనవారిని వెతకడం, బాధితులకు సహాయం చేయడం, పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించడంపై నేపాల్ దృష్టి సారించింది.

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు

నేపాల్‌లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్‌లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం కంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.



**దిగువ ప్రాంతాల్లో విధ్వంసం!**

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్?బర్స్ట్?ఫ్లడ్(+శ్రీంఖీ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్?లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనే సుమారు 4700 సరస్సులు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

**సౌత్ లొనాక్ విపత్తు మర్చిపోలేం**

భారత్ ఇప్పటికే ప్రమాదాన్ని చవిచూసింది. 2023 అక్టోబర్ 3వ తేదీన సిక్కింలోని సౌత్ లొనాక్ సరస్సులు వద్ద భారీ విపత్తు సంభవించింది. సరస్సులోకి భారీగా మంచు, రాళ్లు విరిగిపడటంతో ఒక్కసారిగా పెద్ద అల ఏర్పడింది. సుమారు 20 మీటర్ల ఎత్తున ఎగిసిన ఆ నీటి అల దిగువ ప్రాంతాల వైపు దూసుకెళ్లింది. ఆ వరద ప్రవాహానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటన హిమానీనద సరస్సుల ప్రమాద తీవ్రతను దేశం ముందు స్పష్టంగా ఉంచింది.

నేపాల్‌లో జరిగిన తాజా విపత్తు మరో కోణాన్ని బయటపెట్టింది. మంచు లేదా రాళ్లు విరిగిపడటం, ఆ తర్వాత భారీగా మట్టి, రాళ్ల ప్రవాహం ఏర్పడటం, తాత్కాలికంగా సరస్సు ఏర్పడటం, చివరకు ఆకస్మిక వరదగా మారడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరిగే ప్రమాదాలను క్యాస్కేడింగ్ హజార్డ్స్ అంటారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యుడు కృష్ణ వత్స ప్రకారం, ఇలాంటి పరిణామాలు చాలా వేగంగా చోటుచేసుకోవచ్చు. దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడానికి చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉంది. "ప్రస్తుతం హిమాలయాల్లో సుమారు 200 హిమానీనద సరస్సులు ఉండగా, వాటిలో కనీసం 50 నుంచి 60 వరకు అధిక ప్రమాదకరమైనవిగా వర్గీకరణ జరిగింది. ఉష్ణోగ్రతలు పెరిగి హిమానీనదాలు కరగడంతో సరస్సుల వంటి నిర్మాణాల్లో భారీ పరిమాణంలో కరిగిన నీరు పేరుకుపోతుంది. ఒకవేళ భూకంపం సంభవించినా లేదా సరస్సు గట్లలో పగుళ్లు ఏర్పడినా, ఎత్తైన ప్రదేశాల్లో ఉన్న నీరు అపారమైన వేగంతో కిందికి దూసుకువస్తుంది. ఇది ఆ ప్రవాహాన్ని ఉగ్రరూపం దాల్చే వరదగా మార్చి, దాని మార్గంలో ఉన్న ఇళ్లు, హోటళ్లు, రోడ్లు లేదా వంతెనలు వంటి ప్రతిదాన్నీ కొట్టుకుపోతుంది."

# బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జంతువులు, పక్షులలో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. బర్డ్‌ఫ్లూను ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థలను ముందస్తుగా సిద్ధం చేయాలని ఆసియా-పసిఫిక్ దేశాలకు సూచించింది. అయితే భారత్‌లో ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ (ఎ1చీ1) కేసులు పెరుగుతున్న సమయంలోనే, డబ్ల్యూహెచ్ఓ బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇవ్వడంతో ఈ హెచ్చరికకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆగస్టు 25- 27 వరకు డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయాలు సంయుక్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి ఓ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో 150 మందికి పైగా ఇన్‌ఫ్లుయెంజా నిపుణులు, సైంటిస్టులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు. పక్షులలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కొనసాగుతుందని ప్రజారోగ్య నిపుణులు పేర్కొన్నారు. జంతువుల నుంచి మానవులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈటీవీ భారత్‌లో ఆరోగ్య నిపుణులు, సైంటిస్టులు, వైద్యులు మాట్లాడారు.



**లక్షణాలు ఏంటంటే?**

బర్డ్‌ఫ్లూ సోకిన చాలా మంది రోగులలో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని అం టువ్యాధుల నిపుణురాలు, మెడికల్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ మనాలి అగర్వాల్ తెలిపారు. ఈ లక్షణాలతో పాటు న్యుమో నియాకు సంబంధించిన లక్షణాలు కూడా కనిపిస్తాయని చెప్పారు. తరచుగా కనిపించే శ్వాసకోశేతర లక్షణాలలో విరేచ నాలు, వాంతులు, కడుపు నొప్పి ఉన్నాయని వివరించారు. ఈ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడడానికి సన్నద్ధత చాలా కీలకమన్నారు. "ముందుగా బర్డ్‌ఫ్లూ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. ఇది ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఉప రకం. ఇది పక్షులు, క్షీరదాలకు సోకుతుంది. అరుదుగా మానవులకు కూడా సంక్రమిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ సోకిన పక్షులు, ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం, కలుషితమైన పరిసరాల వల్ల ఆ వ్యాధి మానవులకు సోకే ప్రమాదం ఉంది. మానవుల మధ్య ఈ వైరస్ సోకిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను తాకడం, అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం వల్ల మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం ఉంది. పక్షుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంటి పొర ద్వారా వ్యాపిస్తుంది" అని మనాలి అగర్వాల్ పేర్కొన్నారు.

**'డబ్ల్యూహెచ్ఓ సూచనకు అలర్ట్‌గా చూడాలి'**

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపును పరిస్థితికి ప్రతిస్పందనగా కాకుండా, మరో భిన్నమైన ఇన్‌ఫ్లుయెంజా ముప్పు గురించి ఇచ్చిన హెచ్చరికగా చూడాలని ప్రముఖ ఆరోగ్య నిపుణుడు, ఏషియన్ సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తమోరిశ్ కోలే అభిప్రాయపడ్డారు. స్వైన్‌ఫ్లూ అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఒక కాలానుగుణ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ అని తెలిపారు. అయితే బర్డ్‌ఫ్లూ మాత్రం వ్యాధి సోకిన పక్షుల నుంచి, లేదంటే కలుషితమైన పరిసరాల నుంచే మానవులకు వ్యాపిస్తుందని పేర్కొన్నారు. దేశంలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగం, పెంపుడు కోళ్లు, లైవ్ బర్డ్స్ మార్కెట్లు, వలస పక్షుల మార్గాల ఉన్నాయని చెప్పారు.

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన వేదికను శుద్ధీకరణ చేసిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఆ ఘటన నేరమని అన్నారు. ఆ వ్యవహారంపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన ఖర్గే కాంగ్రెస్ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం అనంతరం ఆగస్టు 10వ తేదీన కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆ ఘటనను ప్రస్తావించిన రాహుల్, శుద్ధీకరణ పేరుతో దళితులను అంటరానివారిగా చూపుతున్నారని విమర్శించారు. శుద్ధీకరణ అనేది అంటరానితనానికి మరో పేరు అంటూ అభిప్రాయపడ్డారు. 'దళితులు తాకకూడని వారు, అపవిత్రులు అన్న భావనను ఇది వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అలాంటి చర్యలు నేరం' అని రాహుల్ అన్నారు.

**'బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే'**

అయితే ఆ ఘటనలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వారే ఉన్నారని, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'బీజేపీ ఉత్తరాఖండ్ అధ్యక్షుడే శుద్ధీకరణను సమర్థిస్తున్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ తాను అన్ని కులాలకు చెందిన వ్యక్తినని చెబుతున్నారు. మరి దళిత నాయకుడికి జరిగిన అవమానంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అంటూ ప్రశ్నించారు. ఇక ఆగస్టు 13వ తేదీన రాజ్యసభలో ఆ అంశాన్ని మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనకు పాల్పడిన వారిపై అంటరానితన నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఖర్గే డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడి తరఫున మేం న్యాయం కోరుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఖర్గేకు న్యాయం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు న్యాయం జరిగే చూడాలి' అని రాహుల్ అన్నారు.

**'దళితలను గౌరవించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు'**

ఘటనను కేవలం ఒక రాజకీయ వివాదంగా చూడకూడదని, దేశంలో కుల వివక్షకు సంబంధించిన సమస్యగా చూడాలని రాహుల్ కోరారు. దళితలను గౌరవించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధంగా లేవని ఆరోపించారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం ఇలాంటి వివక్షను నిషేధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళిత పిల్లలను పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, నేలలు ఊడ్చించడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. గ్రామాల్లో సామూహిక బావుల నుంచి దళితులకు నీళ్లు తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. కొన్ని టీ దుకాణాల్లో దళితుల కోసం ప్రత్యేకంగా పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులు, ఇతరుల కోసం గాజు కప్పులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపుగా వెళ్లే సమయంలో దాడులకు గురవుతారనే భయంతో హెల్మెట్ ధరించే పరిస్థితులు కూడా ఉన్నాయని అన్నారు. ఇదే మన దేశ వాస్తవ పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

**'రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'**

దేశంలో ప్రస్తుతం రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నాయకుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఉందని, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస, వివక్ష కొనసాగింది. రాజ్యాంగం దాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాజస్థాన్ కాంగ్రెస్ నేత టికారామ్ జూలీ, కేంద్ర మాజీ మంత్రి జితిన్ రామ్? మాంఝీ వంటి దళిత నేతలు వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని రాహుల్ పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత విజయవంతమైతే, అతడిపై దాడులు అంత తీవ్రంగా ఉంటాయని అన్నారు. అయితే హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ విమర్శలు చేయడాన్ని ఇప్పటికే బీజేపీ ఖండించింది. పార్టీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా గతంలో స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం

జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ డ్రోన్ సంచారం కలకలం రేపింది. ఎల్ఓసీ వెంబడి మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి డ్రోన్ చక్కర్లు కొట్టడాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు సరిహద్దు జిల్లాలను జల్లెడపడుతున్నాయి. డ్రోన్ ఏదైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచిందా? లేదా ఏమైనా తీసుకెళ్లిందా? అనే కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, బాలాకోట్ ప్రాంతంలోని బెహ్రూటి గ్రామం వద్ద రాత్రి 8:05 గంటల ప్రాంతంలో ఓ డ్రోన్ కనిపించింది. కొంతసేపు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టిన డ్రోన్, అనంతరం సరిహద్దుకు సమీపంలోని మంగళ్‌నార్-డబ్రోట్ వైపు కదిలినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తిరిగి పాకిస్థాన్ వైపు వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన బలగాలు నిఘాను మరింత పెంచాయి. తెల్లవారుజామున రంగంలోకి దిగి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని అధికారుల చెప్పారు. డ్రోన్ కదలికలపై నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పదంగా ఏదైనా గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పూంచ్‌తో పాటు జమ్ము ప్రాంతంలోని మరికొన్ని జిల్లాల్లోనూ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉధంపూర్, కథువా, రాజౌరి జిల్లాల పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా బరిలోకి దిగాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఉధంపూర్-కథువా అటవీ బెల్ట్‌లోని కుబాన్, నగేన్, ఖత్రైల్, గోడు ఫలాల్, పదేతర్, చోర్ మొట్టు, కియా, ఖేబా, భేద్, మార్తా, జోఫర్ తదితర మారుమూల గ్రామాలను జల్లెడపడుతున్నాయి.



**ఇద్దరు సాయుధులు**

ఇదే సమయంలో రాజౌరి జిల్లాలోని గైబాస్, మిథియాని, మోగ్లా, నర్లా ప్రాంతాల్లో ఇద్దరు సాయుధులు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో సైన్యం రంగంలోకి దిగింది. బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల గుండా గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అనుమానితులు ఉగ్రవాదులై ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు, సైన్యం, పారామిలిటరీ బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ సాయుధుల గురించి ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ ఏడాది ప్రారంభంలోనూ పాకిస్థాన్?కు చెందిన డ్రోన్లు జమ్ముకశ్మీర్?లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతా దళాలు తిప్పికొట్టాయి. మార్చి 1న జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌కు చెందిన డ్రోన్లు భారత గగనతలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు సరిహద్దుల గుండా చొరబడేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, భారత భద్రతా దళాలు వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాయి. ప్రస్తుతం ఉధంపూర్, కథువా, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో కొనసాగుతున్న తనిఖీలతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా కొంతకాలం క్రితం జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ ద్వారా వాటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానించారు. ఫిబ్రవరి 13న అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం జరిగిన ఈ ఘటనలో కూడా పాకిస్థాన్ డ్రోన్ 'ఏదైనా అనుమానాస్పద వస్తువు విడిచిందా' అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు

-మొదటిపేజీ తరువాయి

తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువు పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల ఓటర్లు ఉండగా అందులో 73 లక్షల 39వేలు మృతి, డూప్లికేట్, ఆబ్‌సెంట్, ఇతర ప్రాంతాలకు షిఫ్టయిన ఏఎస్?డీడీ కేటగిరీలో పెట్టారని సీఈసీకి రాసిన లేఖలో సీఎం వివరించారు. అన్‌మ్యాపింగ్, అనామలిస్ కేటగిరీల్లో మరో 92 లక్షల 86 వేల మందికి నోటీసులు ఇస్తున్నారన్నారు. సుమారు మూడో వంతు ఓటర్లు నిరూపించుకోవడం లేదా ఓటు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు.

ఏఎస్‌డీడీ కేటగిరీలో సుమారు 62 శాతం అంటే 45 లక్షల 19 వేల మంది శాశ్వతంగా షిఫ్ట్ అయిన కేటగిరీలో పెట్టారన్న సీఎం ఓటర్ల పరిశీలన విధానంలో పలు లోపాలున్నాయన్నారు. తాత్కాలికంగా బయటకు వెళ్లిన వారు శాశ్వతంగా షిఫ్టెడ్‌కు తేడా చూపలేదన్నారు. బీఎల్ఓలు వెళ్లిన సమయంలో ఏదైనా పనిపై తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని కూడా శాశ్వతంగా షిఫ్టెడ్?గా పెట్టారన్నారు. నిజంగా శాశ్వతంగా అడ్రస్ మారిన వారు కొత్త ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకునేలా సహకరించకుండా అప్పటి వరకున్న చోట ఓటు తొలగించారని సీఎం వివరించారు. నివాసం మారిన వారికి నోటీసు ఇవ్వకుండానే తొలగించారన్నారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు పోయిందన్న విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, 



మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం ఏఎస్‌డీడీ ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివాలి : తెలంగాణ రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి లేఖలో తెలిపారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించడంతో అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని సవరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలన్న రేవంత్‌రెడ్డి కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని ముఖ్యమంత్రి కోరారు.

కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు డాక్యుమెంట్లను సమర్పించేందుకు వారం సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్రం స్థాయిలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్న సీఎం మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా ఆమోదించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.

### పూర్తి సహకారం ఇస్తాం

హైదరాబాద్‌లో నియోజకవర్గానికి 78 వేలకుపైగా నోటీసులు అందుకుంటున్న వారు ఉన్నందున కొద్దిమంది ఈఆర్‌వోలు సరిపోరన్నారు. అదనపు ఈఆర్‌వోలను కూడా నియమిండంతో పాటు నోటీసుల్లోనే విచారణ తేదీ, సమయాలను పేర్కొంటూ క్షేత్రస్థాయిలో విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అర్హత ఉన్న ప్రతీ ఓటరుకు న్యాయం జరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున హెల్ప్‌డెస్కుల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# అచ్చ కాంగ్రెస్‌లో పచ్చ మీడియా చిచ్చు

తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ ఎపిసోడ్ ముగిసినట్లేనా? ఇంకా సశేషంగానే ఉన్నాదా? ప్రస్తుత రాజకీయ పరిశీల కుల మెదడుకు మేత వేస్తున్న ప్రశ్న ఇది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై లోతైన అవగాహన ఉన్నవారు మాత్రం మరోరకంగా ఆలోచిస్తున్నారు. వాళ్లను తొలుస్తున్న ప్రశ్నావళి సురేఖ ఉదంతం కంటే విస్తృతమైనది. రాష్ట్ర కాంగ్రెస్‌లోగానీ, ఎమ్మెల్యేలు, మంత్రి వర్గ సహచరుల్లోకానీ నిజంగానే రేవంత్‌రెడ్డికి మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నాదా? ఆయన పాలనపై అధిష్టానం వైఖరి ఏమిటి? ప్రభుత్వ పనితీరు మీద ప్రజల్లో కనిపిస్తున్న పెదవి విరుపు ఎక్కడికి దారితీయనున్నది? అసలు తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్తు ఏ విధంగా ఉండబోతున్నది? ఇటువంటి ప్రశ్నలు తలెత్త డానికి సహేతుకమైన కారణాలే కనిపిస్తున్నాయి. కారణాలు న్నాయి కనుకనే యెల్లో మీడియా కలవరపాటుకు లోనవు తున్నది. ఆవేదన వెళ్లగక్కుతున్నది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీ--ప్రభుత్వ వ్యవహారాల్లో పూర్తి స్వేచ్ఛనివ్వడం లేదని కాంగ్రెస్ అధిష్టానంపై యెల్లో మీడియా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నది. రేవంత్ నాయకత్వానికి కంట్లో నలుసుగా వుండే నేతలను ఏరిపారేసి ఆయన్ను బలోపేతం చేయకుంటే కాంగ్రెస్ పార్టీకి పోగాలం దాపురిస్తుందని హెచ్చరించడానికి కూడా యెల్లో మీడియా వెనుకాడటం లేదు. తెలుగుదేశం పార్టీకి యెల్లో మీడియా అనుబంధ పరిశ్ర మగా పని చేస్త్న?తన్నదని కొత్తగా చెప్పుకోనవసరం లేదు. కాంగ్రెస్ వ్యతిరేకతే పునాదిగా తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ ఏర్పాటు చేశారన్నది నిజం. కేంద్రంలో రాజీవ్ సర్కార్‌ను గద్దెదించడం కోసం నేషనల్ ఫ్రంట్‌కు ఎన్టీఆర్ రూపశిల్పిగా మారిన సంగతి కూడా నిజం. అటువంటి తెలుగుదేశం పార్టీకి, దాని అనుబంధ యెల్లో మీడియాకు తెలంగాణ కాంగ్రెస్‌పై ఇంతటి అవ్యాజమైన వాత్సల్యం కుదరడానికి కారణమేమిటి?

ఇది కూడా బ్రహ్మరహస్యమేమీ కాదు. తెలుగు ప్రజలంద రికీ తెలిసిన విషయమే. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా తెలంగాణపై పెత్తనం చేయాలనే కోరిక చంద్రబాబుకు చావ లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల ఓట్ల కొనుగోలుకు ప్రయత్నిస్తూ ఆడియో సాక్షిగా చంద్రబాబు, వీడియో సాక్షిగా అప్పటి ఆయన సహచరుడు రేవంత్‌రెడ్డి క్యాష్‌తో సహా దొరికిపోవడం, ఫలితంగా హైదరాబాద్‌ను వదిలేసి చంద్రబాబు పారిపోవడం తెలిసిన కథే. తామేదో రహస్యంగా దొంగతనం చేయబోతే అన్యాయంగా పట్టుకుని కేసీఆర్ అల్లరి పెట్టాడనే కోపం అప్ప ట్నుంచే చంద్రబాబుకూ, రేవంత్‌కూ ఉన్నది. చంద్రబాబుకు జలుబు చేస్తే ముక్కు చీదే అలవాటున్న యెల్లో మీడియా కూడా నాటినుంచే కేసీఆర్‌ను శత్రువుగా ప్రకటించుకున్నది.

ఉమ్మడి రాష్ట్రంలో వరుసగా రెండుసార్లు రాజశేఖరరెడ్డి చేతిలో ఓటమి పాలైన చంద్రబాబు, జగన్ రాజకీయ జీవితాన్ని మొగ్గలోనే తుంచేయడం కోసం పదిహేనేళ్ల కిందనే కాంగ్రెస్ అధిష్టానంతో స్నేహం నెరపడం ప్రారంభించారు. సిద్ధాంత రాద్ధాంతాలు, విశ్వసనీయత వగైరాలతో తనకు ఏ రకమైన సంబంధం లేదని కొన్ని డజన్లసార్లు చంద్రబాబు నిరూపించుకున్నారు. అందువల్లనే ఎన్డీయేతో బహిరంగ స్నేహం, కాంగ్రె స్‌తో రహస్య ప్రేమ ఏకకాలంలో ఆయన నడపగలిగారు. ఆ స్నేహం ఉపకరించి వర్తమాన రాజకీయ పరిస్థితికి బాటలేసింది. ఎన్నికల సమయం నాటికి కూడా అత్యధిక ప్రజామోదం కలిగిన నేతగా కేసీఆర్ ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌కు ఓటమి తప్పలేదు. కర్ణుడి చావుకు కారణాలు అనేకం. తవ్వుకోవడం అనవసరం.

వ్యవహార దక్షత, ఎన్నికలకు అవసరమయ్యే వనరులను సమీకరించగలిగే సామర్థ్యం రేవంత్‌రెడ్డికి సహజంగానే ఉన్నాయని చెబుతారు. దానికోసం యెల్లో మీడియా, తెలుగుదేశం పార్టీల సంపూర్ణ మద్దతు ఉండనే ఉన్నది. బీజేపీ వ్యతిరేకత మొత్తం బీఆర్ఎస్ మీదనే కేంద్రీకృతమవడంతో అటువైపునుంచి కూడా రేవంత్ కాంగ్రెస్‌కు ఇబ్బంది లేకుండా పోయింది. అధికా రంలోకి వచ్చిన తర్వాత మొన్నటి అమెరికా పర్యటనను అడ్డు కోవడం మినహా ఇతరత్రా రేవంత్ సర్కార్‌ను బీజేపీ ఇబ్బంది పెట్టిన ఘటనలు లేకపోవడం ఆశ్చర్యమే. కాంగ్రెస్ పార్టీలో తనకో సొంత వర్గాన్ని తయారు చేసుకోవడం కోసం తెలుగు దేశం పార్టీ తెలంగాణా అవశేషాలను కాంగ్రెస్‌లోకి రేవంత్ బదిలీ చేయగలిగారు. ఇప్పుడీ అవశేష తెలుగుదేశం శ్రేణులకే పెత్తనం దక్కాలనే వాంఛ యెల్లో మీడియాలో కనిపిస్తున్నది.

దశాబ్దాల చరిత్ర కలిగిన కొందరు కాంగ్రెస్ నాయకులను ఈ కారణాల వల్లనే యెల్లో మీడియా టార్గెట్ చేస్తున్నదనీ, వారిమీద నెగెటివ్ ముద్రలు వేస్తున్నదనే ఆరోపణలు కాంగ్రెస్ శ్రేణులనుంచి వినపడుతున్నాయి. కొండా సురేఖ వివాదం నలుగుతున్న సందర్భంగా ఒకరోజు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అక్కడున్న మీడియాతో మాట్లాడవలసి వచ్చింది. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మీడియాపై పేరు పెట్టి మరీ ఆయన తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పార్టీలో మీక్కావలసిన ఎవరినో బలోపేతం చేయడం కోసం నాలాంటి నిజాయితీపరులైన నాయకుల మీద నిందలేస్తున్నారని ఆయన దుమ్మెత్తిపోశారు. ఈ వాక్యాన్ని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు.

వర్తమాన కాలంలోని సగటు రాజకీయ నాయకులకు భిన్నంగా జనసామాన్యంలో మంచి పేరున్న నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. గత ఇరవయ్యేళ్లుగా తన తల్లి పేరుమీద ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఏం వ్యాపారాలు చేస్తారో ఎక్కడ చేస్తారో తెలియదు కానీ, నియోజకవర్గంలో మాత్రం కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు రాజగోపాలరెడ్డి వెనుకాడరని స్థానిక ప్రజలు చెబుతారు. సొంత అసెంబ్లీ నియోజకవర్గం మునుగోడులోనే కాకుండా భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని నియోజక వర్గాల్లో కోమటిరెడ్డి సోదరులకు అనుచరగణం, పలుకుబడి ఉన్నాయని చెబుతారు. కాంగ్రెస్ పార్టీలో ఇమడలేని పరిస్థితి ఏర్పడినప్పుడు తన అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసి మరీ రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఆ పార్టీతో భావసారూప్యత పొసగక తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఇటువంటి నేపథ్యం ఉన్న తనపై అవాకులు చవాకులు ప్రచారం చేస్తున్నదని మీడియాపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని తప్పు పట్టగలమా?

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై కూడా ఆ మధ్యన ఒక టీవీ ఛానల్ ధారావాహిక దాడికి పాల్పడింది. ముఖ్యమంత్రికి సన్నిహితులైనవారు ఈ ఛానల్‌ను నడిపిస్తారని చెబుతారు. మహేష్‌గౌడ్ మూడున్నర దశాబ్దాల కిందనే ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ నాయకునిగా, సేవాదళ్ కార్యకర్తగా పని చేస్తూ ఏనాడూ కాంగ్రెస్ జెండాను భుజం మీదినుంచి కిందకు దింపలేదు. వందలాది ఎకరాల సాగుభూములున్న కుటుంబం నుంచి వచ్చిన మహేశ్‌గౌడ్‌కు ఏనాడూ అవినీతి మకిలి అంటింది కూడా లేదు. అటువంటి వ్యక్తిని అయోగ్యుడిగా చిత్రించడానికి సదరు టీవీ ఛానల్ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఒకటి రెండు ఉదాహరణలు మాత్రమే ఇవి.

కొండా సురేఖ తాజా వివాదానికి ఆమె కుమార్తె సుష్మిత ముఖ్యమంత్రిపై చేసిన ఘాటు వ్యాఖ్యలే కారణమనే సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిపై సుష్మిత ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఎవరూ హర్షించరు. ఆమె చేసిన వ్యాఖ్యలకు కారణమెవరు? వరంగల్ జిల్లా పరకాల నియోజక వర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో కూడా రేవూరి ప్రకాశ్‌రెడ్డి పోటీ చేస్తారని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ స్థానంపై ఎప్పటి నుంచో దృష్టి పెట్టిన సుష్మిత ఘాటుగా స్పందించారు. సుష్మిత సంగతి పక్కన పెడితే కాంగ్రెస్ కల్చర్‌లో అభ్యర్థులను ముందు గానే ముఖ్యమంత్రి నిర్ణయించే సంప్రదాయం ఉన్నదా? అంతే కాకుండా ఇంకో పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని కూడా రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు.

పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ సీఎం స్థానం నిజంగా అంత బలంగా ఉన్నట్లయితే సురేఖ మీద చర్య తీసుకోవడానికి ఇంత తతంగం ఎందుకు? మొదట 20 మంది శాసనసభ్యులతో ప్రెస్ మీట్, సురేఖను తప్పించాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు, దాన్ని హైకమాండ్‌కు పంపించడం, సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కేసీ వేణుగోపాల్ రాకకోసం నిరీక్షణ... ఇదంతా అవస రమా? సీఎం తలుచుకుంటే ఏ మంత్రినైనా తప్పించే అధికారం రాజ్యాంగబద్ధంగానే ఉన్నది. ఆ అవకాశాన్ని వినియోగించు కోలేని అశక్తత ఎందుకొచ్చింది? గత ఎన్నికల సందర్భంగా రేవంత్‌ను ఫోకస్ చేయడం కోసం నల్లగొండ గద్దర్ నర్సన్న పాడిన ఒక పాట పాపులరయింది. "మూడు రంగుల జెండా పట్టి... సింగమోలే కదిలినాడు... మన రేవంతన్న" అని సాగు తుందా పాట.

ఎక్కడ ముఖ్యమంత్రి సభ జరిగినా ఆ రికార్డు పెట్టడం రివాజు. గత కొంత కాలంగా గాంధీ భవన్‌లో జరిగే కార్యకర్తల సమావేశంలాంటి కార్యక్రమాల్లో ఆ పాట వినిపించ కూడదనే ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. పరకాల సంగతేమోగానీ కొండా సుష్మిత కాంగ్రెస్ పార్టీలోకి ఒక కొత్త పదబంధాన్ని తెచ్చారు. 'అచ్చ కాంగ్రెస్--పచ్చ కాంగ్రెస్' అనే మాటపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. యెల్లో మీడియా ట్రాప్‌లో పడి 'అచ్చ' కాంగ్రెస్ నేతలను టార్గెట్ చేస్తూపోతే కాంగ్రెస్ పార్టీ బలపడుతుందనుకోవడం భ్రమ. ఒక పక్కన ప్రభుత్వ పాలనపై జనసామాన్యంలో పేరుకొంటున్న తీవ్ర అసంతృప్తి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని సమైక్యంగా నడిపించ డంపై దృష్టి పెట్టకపోతే వచ్చే ఎన్నికల్లో దారుణమైన పరాజ యాన్ని మూట కట్టుకోవలసి వస్తుందని గ్రహిస్తే మంచిది.

## కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు...

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం?బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు.

## సెప్టెంబర్ 7నుంచి అసెంబ్లీ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రశ్నలు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి సూచించారు. వచ్చే నెల 2లోపు ఇవి అందించాలని తెలిపారు. రూల్–39 ప్రకారం సభ్యులు అడిగే ప్రశ్నలకు సభలో మంత్రులు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు ప్రశ్నలను సంబంధిత శాఖలకు పంపించి తెలంగాణ ప్రభుత్వం సమాధానాలు సిద్ధం చేయనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు శాసన సభ్యులకు కార్యదర్శి రేండ్ల తిరుపతి లేఖ రాశారు.

## 'సర్' నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి




**హైదరాబాద్:** ఎస్ఐఆర్‌లో నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బీఎల్వోలు ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా ఇవ్వాలని సీఈవో స్పష్టం చేశారు. రెండు రోజుల ముందు విచారణ ప్రాంతం, తేదీ, సమయం ఓటర్లకు తెలపాలన్నారు. నోటీసులకు వారం రోజుల్లో వివరణ ఇచ్చే గడువును కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియలపై జిల్లాల కలెక్టర్లతో సీఈవో సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నోమ్యాపింగ్, అనామలిస్ ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు ఇవ్వాలని సీఈవో తెలిపారు. నోటీసుతో పాటు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల వివరాలను ప్రతీవారం రాజకీయ పార్టీలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జీఎస్ చారి పాల్గొన్నారు.

## మహారాష్ట్ర సమ్మతి పొందడమే ప్రధాన లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

బ్యారేజీ వల్ల కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు. రెండు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలకు కేంద్రం వేదిక కల్పించిన నేపథ్యంలో తెలంగాణ జల ప్రయోజనాలను బలమైన సాంకేతిక ఆధారాలతో ప్రతిపాదించే విషయమై చర్చించారు. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య అధికారిక చర్చల ప్రక్రియ ప్రారంభం కావడమే ప్రాణహిత పునరుజ్జీవంలో కీలక ముందడుగని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ కేంద్రంతో నిరంతరం జరిపిన సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలకు మార్గం సుగమమైందని అన్నారు.

## ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. వెంటనే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి.. రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఐఎం




ప్రకటించిన వివరాల ప్రకారం.. మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించారు. అయితే ఆయనపై ఇంత కఠిన చర్య తీసుకోవడానికి దారితీసిన వీడియో లీక్ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. దీంతో అసలు వ్యవహారం ఏమిటన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. రహ్మత్ బేగ్‌పై పార్టీ చర్యలకు వీడియో లీక్ వ్యవహారమే కారణమని ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పలు ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు. ఇటీవలే రహ్మత్ బేగ్ తనపై డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను బయటపెడతామంటూ కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరించారని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే ఎంఐఎం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశించడం మరింత ఆసక్తిని రేపుతోంది. అయితే డీప్‌ఫేక్ బెదిరింపుల కేసు, పార్టీ బహిష్కరణ నిర్ణయానికి నేరుగా సంబంధం ఉందని ఎంఐఎం అధికారికంగా ప్రకటించలేదు. 2023లో హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి మీర్జా రహ్మత్ బేగ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2029 మే వరకు కొనసాగాల్సి ఉంది. అయితే పార్టీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఆదేశాల మేరకు మండలి చైర్మన్‌కు మీర్జా రహ్మత్ బేగ్ రాజీనామా సమర్పిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు అనే తేడా లేకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇక రహ్మత్ బేగ్ ఇటీవల సౌదీ అరేబియాకు వెళ్లినట్లు.. అక్కడి నుంచి పార్టీ ఆదేశాల నేపథ్యంలో తిరిగి హైదరాబాద్‌కు వచ్చినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఆయనను ఎందుకు అత్యవసరంగా హైదరాబాద్‌కు రప్పించారనే విషయంపై అధికారికంగా స్పష్టత లేదు. ఈ అంశంపై కూడా పార్టీ నుంచి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. మొత్తంగా ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ, ఆయనకు పార్టీ నుంచి వచ్చిన రాజీనామా ఆదేశాలు, మరోవైపు డీప్‌ఫేక్ వీడియోల పేరుతో వచ్చిన బెదిరింపులు ప్రస్తుతం హైదరాబాద్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలో వైరల్ అవుతున్న ఆరోపణలను వాస్తవాలుగా పరిగణించకుండా.. పార్టీ అధికారిక ప్రకటనలు, పోలీసుల దర్యాప్తు ఆధారంగా మాత్రమే తదుపరి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

## క్రీడాకారులను సన్మాన

**రామడుగు:** రామడుగు మండలం గోపాల్ రావు పేట లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శనివారం రోజున గోపాల్ రావుపేట ప్రభుత్వ పాఠశాల లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడా కారులు రేణికుంట అభిషేక్ వాలీబాల్ పల్లపు దివ్య శ్రీ వాలీబాల్ పీడీ దొడ్డ వీరపాల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు ఉపాధ్యాయులు గుజ్జుల జలపతి రెడ్డి కుర్ర రవిని సన్మానించారు. లయన్స్ క్లబ్ మైక్రో కేబినెట్ మెంబర్స్ గోలి మధుసూదన్ రెడ్డి కర్ర శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు జాతీయ సమైక్యత భావ సమైక్యత పెంపొందుతాయాని శరీరక దృఢత్వం మానసిక ఉల్లాసం పెంపందుతుందని వారు సూచించారు.ఎన్ని భాషలు వచ్చిన మాతృభాషను మరువద్దన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పీడీ వీపాల్ రెడ్డి తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గొడుగు అంజి యాదవ్ పాకాల మోహన్ కోశాధికారి మూల అనంత రెడ్డి మైక్రో కేబినెట్ మెంబర్స్ గోలి మధుసూదన్ రెడ్డి కర్ర శ్యాం సుందర్ రెడ్డి డైరెక్టర్స్ ముదుగంటి చంద్రశేఖర్ రెడ్డి ఎడవెల్లి రాజిరెడ్డి పబ్బతి మల్లారెడ్డి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ్ దంపతులపై
## అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం

**సూర్యాపేట :** ఉత్తమ్ దంపతులు కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చేసిన అభివృద్ధిపై చర్చకి రావాలని వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కోదాడ మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత 5 ఏళ్ల ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఇప్పుడు జరిగిన అభివృద్ధిపై చర్చకు దమ్ము, ధైర్యం ఉంటే సమయము, ప్లేసు చెబితే అక్కడికి వస్తామని కానీ పుణ్య దంపతులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే మా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్ గా ఓడిపోయిన ఉపేందర్ అనే వ్యక్తి డబ్బా కొట్టు పెట్టుకొని బ్రతుకుతున్నాడు అన్న పదానికి అర్థం లేదని ఉత్తమ్ దంపతులు క్షుద్ర పూజలు చేస్తున్నారు అనటం సిగ్గుమాలిన చర్య అని దీని వెనక బొల్లం మల్లయ్య యాదవ్ హస్తం ఉందని అన్నారు. ఇలా అన్న వ్యక్తిని పట్టణ సిఐ ఏ ఆయుధం లేకుండా అతనిని అదుపులోకి తీసుకోవటం దానిని కూడా రాజకీయం చేయటం సబబు కాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ యువకులను రెచ్చగొట్టి ఈ విధంగా అనిపించటం వారి భవిష్యత్తుని నాశనం చేయడం ఘోరమైన చర్యఅని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవాకులు చవాకులు పేలితే కాంగ్రెస్ సైన్యం పొరపాటున కూడా ఊరుకోదని హెచ్చరించారు.ఈ సమావేశంలో కోదాడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శరభయ్య,మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కొత్తా గురువయ్య, కాంగ్రెస్ నాయకులు భాష బోయిన భాస్కరరావు, సీతారాంరెడ్డి, నంబూరి సూర్యం,నలజాల శ్రీనివాసరావు,మండల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలు రజితను పరామర్శించిన
## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**అండగా ఉంటానని హామి**

**చొప్పదండి** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటయ్యపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టి వెంకటి హారిక దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి మూడవ కుమార్తె ఇడగొట్టి రజిత పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో తల్లిదండ్రులు కష్టపడి చిన్నారిని పెంచుతున్నారు.దివ్యాంగురాలు రజిత పరిస్థితిని తెలుసుకున్న చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం వెంకటాయపల్లి గ్రామంలోని ఆమె ఇంటికి స్వయంగా వెళ్లి రజిత పరిస్థితిని గమనించి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. వెంటనే గంగాధర ఎంపీడీవో తో మాట్లాడి రజితకు వికలాంగుల పెన్షన్ వచ్చేలా చూడాలని ఆదేశించారు. పెన్షన్ మంజూరు కు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కు రజిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంకిడి సంధ్య రామచంద్ర రెడ్డి, ఉప సర్పంచ్ ఆసిఫ్,మోహన్ రెడ్డి,గుర్రం నర్సాగౌడ్, సురేష్, జయంత్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సన్న రకం వరి రైతులు
## వివరాలు నమోదు చేసుకోవాలి

**సెప్టెంబర్ 10లోగా విత్తన కొనుగోలు వివరాల ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి**

**తాండూరు;** ప్రభుత్వంప్రాధాన్యతనిస్తున్న సన్న రకం వరి వంగడాలను సాగు చేస్తున్న రైతులు తమ విత్తన కొనుగోలు వివరాలను సంబంధిత విత్తన డీలర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె. సుష్మ సూచించారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు.అలాగే డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వాలంటీర్‌ను ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. వాలంటీర్లు తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రతి సర్వే నంబర్ వారీగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేయనున్నారు.రైతులు తమ పొలాలకు వచ్చే డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లకు సహకరించి, సాగు చేస్తున్న పంటల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయించుకోవాలని కె. సుష్మ కోరారు.విత్తన కొనుగోలు వివరాలతో పాటు డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదైన పంట వివరాలను సంబంధిత మార్కెటింగ్ అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన సన్న రకం వరి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ప్రయోజనం అందే అవకాశం ఉంటుందని వివరించారు.కాబట్టి సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులందరూ సెప్టెంబర్ 10లోగా విత్తన కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు, డిజిటల్ క్రాప్ సర్వేలో సర్వే నంబర్ వారీగా తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె. సుష్మ విజ్ఞప్తి చేశారు.

## బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్ :** మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బోధనా సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించడం పట్ల కలెక్టర్ హర్షం వెలిబుచ్చారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్ కు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతిని సందర్శించి విద్యార్థిని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, మోపాల్ తహసిల్దార్ రేఖ, ఎం.ఈ.ఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

# నైట్ లైఫ్ కోసం ప్రత్యేకబస్సులు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి, ముఖ్యంగా రాత్రి షిఫ్టుల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అత్యంత కీలకమైన, తీపి కబురు అందించింది. నగరంలో నైట్‌లైఫ్ వేగంగా విస్తరిస్తున్న వేళ అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆర్టీసీ అడుగులు వేసింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నగరవ్యాప్తంగా ప్రధాన కారిడార్లలో రాత్రి సమయాల్లో నిరంతరాయంగా బస్ సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఈ నైట్ బస్ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి.రాత్రి వేళల్లో ఆటోలు, ప్రైవేటు క్యాబ్ డ్రైవర్ల ఇష్టారాజ్యంగా వసూలు చేసే అధిక ఛార్జీలతో జేబులు ఖాళీ అవుతున్నాయన్న సామాన్య, మధ్యతరగతి ప్రయాణికుల సుదీర్ఘకాలపు ఆవేదనకు ఈ నిర్ణయంతో ఎండ్ కార్డు పడనుంది. ఐటీ హబ్‌లైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాలతోపాటు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లను కలుపుతూ ఈ ప్రత్యేక నైట్ బస్సులను నడపనున్నారు. ఐటీ రంగ ఉద్యోగులు, రాత్రి వేళల్లో పని చేసే హాస్పిటల్ సిబ్బంది, హోటల్ రంగానికి చెందిన కార్మికులు, ఇతర సుదూర ప్రాంతాల నుంచి అర్ధరాత్రి వేళల్లో నగరానికి చేరుకునే రైలు, బస్ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ సేవలను పునరుద్ధరించినట్లు ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. కోఠి నుంచి ఐటీ పార్కులు, పారిశ్రామిక వాడలను కలుపుతూ పటాన్‌చెరు వరకు నాలుగు 222a సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఇవి కోఠి, అబిడ్స్, లక్డీకాపూల్, బషీర్‌బాగ్, ఉస్మానియా యూనివర్సిటీ, గట్టలబేగంపేట్, కొండాపూర్, కోకాపేట, మియాపూర్ పటాన్ చెరు చేరుకోవచ్చు. ఈ బస్ రాత్రి 11.40 గంటలు బయల్దేరి చివరి స్టాప్‌కు 4.30 చేరుకుంటుంది. ప్రతి 45 నిమిషాలకు ఒక బస్ ఉంటుంది.

**సీబీఎస్– పటాన్‌చెరు సబర్బన్ కారిడార్(రూట్ నెంబర్ 218)**

మహాత్మా గాంధీ బస్ స్టేషన్, అఫ్జల్ గంజ్ ప్రాంతాల నుంచి పశ్చిమ హైదరాబాద్ శివార్లకు ప్రయాణించే వారి కోసం రూట్ నెంబర్ 218 అత్యంత సౌకర్యవంతంగా ఉండనుంది. సీబీఎస్, కోఠి, లక్డీకాపూల్, ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, కేపీహెచ్‌బీ, మియాపూర్, లింగంపల్లి, రామచంద్రాపురం మీదుగా పటాన్ చెరు చేరుకోవచ్చు. ఈ రెండు స్టేషన్ల మధ్య



రాత్రి 11.25 నిమిషాలకు బయల్దేరి 3.05 గంటలకు ముగుస్తుంది.

**సికింద్రాబాద్ – పటాన్ చెరు ఐటీ అండ్ ఇండస్ట్రియల్ లైన్ (రూట్ నంబర్ 219)**

రైల్వే స్టేషన్‌కు అర్ధరాత్రి వేళల్లో చేరుకునే వేల మంది ప్రయాణికులకు, కూకట్‌పల్లి, ఐటీ రంగానికి ప్రయాణించే ఐటీ ఉద్యోగుల కనెక్టివిటీ కోసం రూట్ నంబర్ 219 సిద్ధం చేశారు. ఈ రూట్ బస్ సికింద్రాబాద్, ప్యారడైజ్, ట్యాంక్‌బండ్, బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, లింగంపల్లి, రామచంద్రాపురం మీదుగా పటాన్చెరు చేరుకుంటుంది. మొదటి బస్సు రాత్రి 11.20 గంటలకు బయల్దేరనుంది. చివరి బస్సు ఉదయం 3 గంటలకు బయలుదేరుతుంది. ప్రతి 70 నిమిషాలకు ఒక సర్వీసు నడుపుతారు.

**హయత్నగర్ ? సికింద్రాబాద్ ఈస్ట్–సెంట్రల్ కనెక్టర్**

విజయవాడ జాతీయ రహదారి వైపు నుంచి వచ్చే ప్రయాణికులకు, ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల వారికి సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ పరిసరాలకు చేరడానికి రూట్ నంబర్ 290u సర్వీస్ నడపనున్నారు. ది హయత్నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోల్, నాగోల్ మెట్రో స్టేషన్, ఎన్జీఆర్ఐ, తార్నాక, ఉస్మానియా యూనివర్సిటీ, విద్యానగర్, రసూల్పురా, జూబ్లీ బస్ స్టేషన్ వరకు సర్వీస్ నడవనుంది. మొదటి బస్సు రాత్రి 11.20 గంటలకు బయలుదేరుతుండగా, చివరి బస్సు ఉదయం 3 గంటలకు ప్రారంభమవుతుంది. 75 నిమిషాల వ్యవధిలో ఒక సర్వీస్ అందుబాటులో ఉంటుంది.

**బాచుపల్లి – వేవ్రాక్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ షటిల్**

బాచుపల్లి, మియాపూర్ వంటి ప్రముఖ నివాస ప్రాంతాల నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో, ఇన్ఫోసిస్, వేవ్రాక్ క్యాంపస్‌లకు వెళ్లే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అనుగుణంగా 195a సర్వీసు డిజైన్ చేశారు. ఈ సర్వీస్ బాచుపల్లి, జేఎన్టీయూ , ఈఎస్ఐసీ, ఇంద్రానగర్, బయోడైవర్సిటీ సిటీ, విప్రో సర్కిల్, ఇన్ఫోసిస్ క్యాంపస్, వేవ్రాక్ మీదుగా వెళ్తుంది. మొదటి బస్సు రాత్రి 9.15 గంటలకే ప్రారంభమవుతుంది. చివరి బస్సు ఉదయం 03:10 గంటలకు బయలుదేరుతుంది . ప్రతి 40 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది.

**కొండాపూర్ – సికింద్రాబాద్ పోలీస్ లైన్స్**

ఐటీ హబ్ కొండాపూర్ ప్రాంతం నుంచి సికింద్రాబాద్ పోలీస్ లైన్స్ మధ్య రూట్ నంబర్ 10 ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. మొదటి బస్సు రాత్రి 10.55 గంటలకు, చివరి బస్సు ఉదయం 3.40 గంటలకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ప్రతి 50 నిమిషాల వ్యవధిలో ఒక సర్వీసు అందుబాటులో ఉంటుంది.

# ఫాస్టాగ్ నుంచే నేరుగా ఈ-చలాన్ కట్!

**హైదరాబాద్ :** హైదరాబాద్ వాహనదారులకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు బిగ్ అలర్ట్ ఇస్తున్నారు. రోడ్డుపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే ఇకపై కేవలం ఫోన్‌కు వచ్చే చలాన్ మెసేజ్ చేయడం కాదు. మీరు సిగ్నల్ జంప్ చేసినా, లిమిట్‌కు మించి స్పీడ్ వెళ్లినా, పార్కింగ్ స్థలంలో వాహనాన్ని నిలిపి ఉంచినా మీ ఫాస్టాగ్ నుంచి జరిమానా సొమ్ము ఆటోమేటిక్‌గా కట్ కాబోతోంది. దీన్ని త్వరలోనే అమలు చేయడానికి సైబరాబాద్‌ట్రాఫిక్ పోలీసులు ప్లాన్ చేస్తున్నారు. నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల రద్దీ, బాధ్యతారహితమైన డ్రైవింగ్, భారీగా పేరుకుపోతున్న ఈ-చలాన్ బకాయిలకు పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ పోలీసులు ఈ సరికొత్త వ్యూహాన్ని అమలు చేయనున్నారు. టెక్నాలజీని వినియోగించుకొని రోడ్డు భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా ఈ ఫాస్టాగ్ చలాన్ ఆటో డెబిట్ విధానంపై హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవల ప్మెంట్ అథారిటీ అధికారులతో పోలీసులు విస్తృత సంప్రదిం పులు జరుపుతున్నారు. అనుమతులు లభించిన వెంటనే ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ నిర్వహించిన 20వ వార్షికోత్సవ సదస్సులో ఈ సంచలన ప్రతిపాదన చేశారు. రహదారి భద్రత– సాంకేతికత, పౌరుల భాగస్వామ్యం అనే అంశంపై జరిగిన ప్రత్యేక చర్చా వేదికలో సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్ప్రీత్ సింగ్ దీనికి సంబంధించిన వివరాలు అందజేశారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీ ఆధారంగా ఉల్లంఘనలను గుర్తించి ఆటోమేటిక్ ఈ చలాన్లు జారీ చేస్తున్నారు. కానీ చాలా మంది వాహనదారులు ఈ చలాన్లను సకాలంలో చెల్లించడం లేదు. ప్రభుత్వం ఎప్పుడైనా డిస్కౌంట్ లేదా రాయితీ ఇస్తేనే కడదాం




అనే ధోరణిలో బకాయిలను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు వాహనదారుల బ్యాంక్ అకౌంట్ లేదా ఫాస్టాగ్ వాలెట్‌తో అనుసంధానించాలని జాయింట్ సీపీ ప్రతిపాదించారు. "కేవలం జరిమానాలు వేయడమే సమస్యకు పరిష్కారం కాదు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి చిటారపోటు ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం అత్యవసరం . రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు. ప్రభుత్వం విభాగాలు, టెక్నాలజీ నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు భాగమైతే సురక్షిత నగరాన్ని నిర్మించుకోవచ్చు" ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థలను ఎక్కువగా ఉపయోగించుకోవాలంటే లాస్ట్ మైల్ కనెక్టివిటీని పటిష్టం చేయాలి. మెట్రో స్టేషన్లు, ప్రధాన బస్‌స్టాండ్ల నుంచి కాలనీలు, గమ్యస్థానాలకు చేరడానికి వీలుగా ఫీడర్ బస్సులు, షటిల్ సర్వీసులు, ఎలక్ట్రిక్ రిక్రూట్‌మెంట్ అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు. నగరంలోని వ్యాపార కూడళ్లు, ఐటీ కారిడార్లలో ప్రధాన సమస్యగా మారిన అడ్డదిడ్డ పార్కింగ్‌ను అడ్డుకోవడానికి అత్యాధునిక మల్టీ లెవెల్ పార్కింగ్ కేంద్రాల విస్తరణ అత్యవసరమని గుర్తించారు. రోడ్డు పక్కన ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటూనే క్రమశిక్షణతో కూడిన పార్కింగ్ విధానాన్ని ప్రోత్సహించనున్నారు.

## 30 ఏళ్లుగా జీవనాధారమైన ఒంటరి మహిళ డబ్బా తొలగింపుపై తీవ్ర నిరసన

**పోలీసుల పక్షపాత వైఖరికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 2వ తేదీన పోలీస్ స్టేషన్ ఎదుట మహాధర్నా**

**మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**

**సూర్యాపేట** కోదాడ నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన లేకుండా పోయిందని, అమాయకులపై దౌర్జన్యాలు చేస్తూ ఆటవిక రాజ్యం, పోలీసు రాజ్యం నడుపుతున్నారని కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి బాధితురాలు గంధం కనకమ్మ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసు అధికారుల తీరును, అధికార పక్ష కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఎండగట్టారు. వాట్సాప్ గ్రూపులో ఫార్వర్డ్ మెసేజ్‌లు పెట్టారనే చిన్న కారణంతో హైదరాబాద్‌లో ఉన్న ఉపేందర్ అనే వ్యక్తిని ఏదో దేశద్రోహి తరహాలో కోదాడ పోలీసులు బలగాలతో వెళ్లి పట్టుకొచ్చి, అర్ధరాత్రి వరకు విచారణ పేరిట మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. న్యాయవాదులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ కల్పించుకునేంత వరకు అక్రమంగా నిర్బంధించారని మండిపడ్డారు. ఉపేందర్‌కు సోదరి అయినందుకే కక్షగట్టి, కోదాడ బొడ్రాయి సెంటర్‌లో గత 30 ఏళ్లుగా పాన్ డబ్బా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న కనకమ్మ అనే ఒంటరి మహిళ డబ్బాను తెల్లవారుజామున అకస్మాత్తుగా తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాఖీ పండుగ వేళ న్యాయం కోసం నిరసన



తెలిపిన మహిళలు, కుటుంబ సభ్యులపై సీఐ శివశంకర్ నేతృత్వంలో పోలీసులు గూండాల మాదిరిగా వ్యవహరించి దాష్టీకం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాతే పట్టణంలో గంజాయి దందాలు, అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. పట్టబద్ధ క్వింటాన్నర గంజాయిని మాయం చేసి అమ్ముకున్నా, బ్రిడ్జి దొంగల నుంచి లంచాలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నా పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. గతంలో తన ప్రెస్ మీట్‌పై ఒక సీఐ హోదాలో ఉండి అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినప్పుడు, ఆధారాలతో డీజీపీ, ఎస్పీ, డీఐజీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా ఏదిన్నటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్ జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోతే స్పందించని పోలీసులు, సామాన్యుల పొట్ట కొట్టడానికి మాత్రం ఉత్సాహం చూపుతున్నారని విమర్శించారు. గతంలో రాజకీయ ఇబ్బందులు పెట్టేందుకు దళిత బిడ్డ కర్ల రాజేష్ ను ఎలా పొట్టనపెట్టుకున్నారో గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే రీతిలో ఉపేందర్ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసి రోడ్డున పడేసే కుట్రలు చేస్తున్నారని హెచ్చరించారు. సామాన్య ప్రజల పొట్టకొట్టే దౌర్జన్యాలు ఆపాలని, బాధిత మహిళ కుటుంబానికి తక్షణమే పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఏకపక్ష వైఖరికి, అక్రమ కేసులకు నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీన సహచర, ప్రజాస్వామిక పక్షాలను కలుపుకుని కోదాడ పోలీస్ స్టేషన్ ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. చట్టం ప్రకారం న్యాయపోరాటం చేయడంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ బాధితుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.

బిజినెస్

## ఏథర్ నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్.. రూ.లక్షకే 'కోణార్క్'



ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ మరో స్కూటర్‌ను విపణిలోకి విడుదల చేసింది. 'కోణార్క్' (ఙూప్రవతీ ఖశీఖుతీఎ) పేరుతో తీసుకొచ్చిన ఈ స్కూటర్ ూ, ూ అనే రెండు వేరియంట్స్‌లో లభించనుంది. రూ.లక్ష ప్రారంభ ధరతో వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఎస్ వేరియంట్‌లో మొత్తం నాలుగు మోడల్స్‌ను తీసుకొచ్చింది.

**బ్యాటరీ సామర్థ్యం, రేంజ్ ఇలా..**

2.1ఎఔప్త బ్యాటరీ సామర్థ్యం కలిగిన ూ100 వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో 100 కి.మీ. (×ఱజ) వరకూ ప్రయాణించవచ్చని కంపెనీ చెబుతోంది. అలాగే 2.7ఎఔప్త, 3.5ఎఔప్త బ్యాటరీ సామర్థ్యంతో పనిచేసే వేరియంట్స్ వరుసగా 125 కి.మీ. (×ఱజ), 161 కి.మీ. (×ఱజ) రేంజ్‌ను ఇవ్వనున్నాయి. వీటి టాప్ స్పీడ్ 70ఎఎజూప్త. కోణార్క్ 450ఔ ఆన్‌బోర్డ్ ఛార్జర్‌తో రానుంది. దీనిని 900ఔ ఆఫ్ బోర్డ్ ఛార్జర్‌కు అనుసంధానించడం ద్వారా మొత్తం 1.35ఎఔ ఛార్జింగ్ సామర్థ్యాన్ని పొందవచ్చు. ఇంటి వద్ద 0–80శాతం ఛార్జ్ చేయడానికి ూ100 వేరియంట్‌కు 4 గంటల సమయం, ూ125కు 4గంటలా 30 నిమిషాలు, ూ161కు 5గంటలా 40 నిమిషాల సమయ పడుతుందని కంపెనీ చెబుతోంది. అదే కంబైన్డ్ ఛార్జ్ సాయంతో ఈ సమయం సగానికి తగ్గుతుందట. కేవలం 10 నిమిషాలు ఛార్జ్ చేయడం ద్వారా 13కి.మీ. వరకూ ప్రయాణింవచ్చని ఏథర్ వెల్లడించింది. ూ వేరియంట్‌లో 200 కి.మీ రేంజ్ ఇచ్చే మరో స్కూటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ఏథర్ తెలిపింది.

**సమయం, పని భారం తగ్గించేలా..**

ఇటు వినియోగదారులు, అటు ఏథర్ సర్వీస్ సెంటర్లలోని టెక్నీషియన్స్ సమయం ఆదాయ చేయడం కోసం కోణార్క్ డిజైన్‌లో కీలక మార్పులు చేసినట్లు ఏథర్ చెబుతోంది. క్షేత్రస్థాయిలో ఏథర్ వాహనాల 26 లక్షల కి.మీ. డేటాను విశ్లేషించి, సరికొత్త ఛాసిస్, పవర్‌ట్రైన్, ఎలక్ట్రానిక్స్ ఆర్కిటెక్చర్‌తో వీటిని తీర్చిదిద్దినట్లు చెబుతోంది. వివిధ విడి భాగాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా సర్వీసింగ్ చేసే సమయం ఆదా అవుతుందని, నిపుణుడైన టెక్నీషియన్ కేవలం 3 నిమిషాల్లో బ్యాటరీని ఊడదీసి, బిగించేలా తీర్చిదిద్దినట్లు తెలిపింది.

**అదనపు ఫీచర్లు..**

ఇక కోణార్క్ 31 లీటర్ల స్టోరేజ్ సామర్థ్యంతో రానుంది. 18ఔ యూఎస్‌బీ టైప్–సిపోర్ట్, అండర్ సీట్ ల్యాంప్, ూ100 వేరియంట్‌కు 4.2 అంగుళాల డిస్‌ప్లే మిగిలిన వాటికి 7 అంగుళాల డిస్‌ప్లే ఇచ్చారు. పార్క్ అసిస్ట్ రివర్స్, ఆటోహోల్డ్ తదితర ఫీచర్లు కూడా ఉన్నాయి. కోణార్క్ జెడ్ వేరియంట్ అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ సిస్టమ్ (ూజుదీూ)తో రానుంది. అలాగే దీనికి మేజిక్ కీ ఇవ్వనున్నారు. స్కూటర్ లాక్, అన్‌లాక్‌ను యాప్ ద్వారా నియంత్రించవచ్చు. గూగుల్ మ్యాప్స్, వాట్సాప్‌లను కూడా జెడ్ వేరియంట్‌లో ఉపయోగించుకోవచ్చు. థెఫ్ట్ అలర్ట్, రైడ్ స్టాటిస్టిక్స్, ఫైండ్ మై స్కూటర్, ఛార్జింగ్ పర్యవేక్షణ, ఓటీఏ అప్‌డేట్స్ వంటి వాటికి జెడ్ వేరియంట్ సపోర్ట్ చేస్తుంది.

# జియో ఐపీవోకు సెబీ సై.. రూ.37,700 కోట్ల నిధుల సమీకరణ?




**న్యూఢిల్లీ :** భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ రాబోతున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) డిజిటల్ సర్వీసెస్ విభాగం.. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ప్రతిపాదనకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు సమాచారం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్‌కు అందింది. ఈ ఏడాది జూన్‌లో ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి జియో తమ డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే.

**ఇదీ సంగతి..**

ఐపీవో ప్రక్రియలో సెబీ ఆమోదమే కీలకం. ఆ తర్వాత సెబీ నిబంధనలకు లోబడి పబ్లిక్ ఇష్యూ పనులను కంపెనీలు మొదలుపెట్టవచ్చు. కాగా, ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా 3.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.37,700 కోట్లు)ను జియో సమీకరించనున్నది. దీంతో ఇప్పుడు హ్యుందాయ్ పేరిట ఉన్న భారతీయ అతిపెద్ద ఐపీవో (3.3 బిలియన్ డాలర్లు) రికార్డు కనుమరుగుకానున్నది. నిజానికి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఐపీవో రూ.30,000 కోట్లతో రాబోతున్నది. వచ్చే నెల ద్వితీయార్థంలో ఉండొచ్చని అంచనా. కానీ ఇదికూడా జియో కంటే చిన్నదే. ఇదిలావుంటే డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. జియో ప్లాట్‌ఫామ్స్ 27 కోట్లదాకా ఫ్రెష్ ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నది. ఇవి ఇష్యూ తర్వాత కంపెనీ మొత్తం ఈక్విటీ బేస్‌లో దాదాపు 2.9 శాతానికి సమానం. ఇక సంస్థ విలువను సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. కాగా, సాధారణ కార్పొరేట్ అవసరాలకేగాక జియో ప్లాట్‌ఫామ్స్ మెటీరియల్ సబ్సిడరీ అయిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్‌కు సంబంధించిన కొన్ని బకాయిలను పాక్షికంగాగానీ, పూర్తిస్థాయిలోగానీ చెల్లించేందుకు ఐపీవో నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ ఏడాది జూన్ ఆఖరునాటికి జియో ఇన్ఫోకామ్ సబ్‌స్క్రైబర్లు 53.3 కోట్లకుపైనే ఉన్నారు. చైనా మొబైల్ తర్వాత వినియోగదారుల ఆధారంగా ప్రపంచంలో ఇదే రెండో అతిపెద్ద సంస్థ కావడం విశేషం.

**ఫుల్ డిమాండ్?**

జియో ఐపీవోకు ఇన్వెస్టర్ల నుంచి ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తుందన్న అంచనాలున్నాయి. దేశీయ టెలికాం మార్కెట్‌లో ఇప్పుడు జియోదే హవా అన్న సంగతి విదితమే. కన్సాలిడేషన్ మోడ్‌లో ఉన్న టెలికాం రంగంలో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మినహా ఉన్నవి మూడే ప్రైవేట్ రంగ కంపెనీలు. అందులో వొడాఫోన్ ఐడియా కంటే ఎయిర్‌టెల్‌తోనే జియోకు గట్టి పోటీ. ఇక 5జీ నెట్‌వర్క్ విస్తరణ, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు సైతం దేశీయ టెలికాం కంపెనీలకు మదుపర్లలో డిమాండ్‌ను పెంచుతున్నాయి. ఈ క్రమంలో జియో పబ్లిక్ ఇష్యూ వైపే ఇప్పుడు మదుపర్ల చూపంతా ఉన్నదని చెప్పకతప్పదు.

## ముంబైలో పాలు మరింత ప్రియం.. సెప్టెంబర్ 1 నుంచి కొత్త ధరలు

ముంబై నగరవాసులకు పాలు మరింత ప్రియం కానున్నాయి. స్థానిక పశువుల షెడ్లు, డెయిరీల నుంచి నేరుగా సరఫరా చేసే 'టబెలా' పాల టోకు ధరను పెంచాలని ముంబై మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. సెప్టెంబర్ 1 నుంచి లీటర్ టోకు ధరను ప్రస్తుతం ఉన్న రూ.93 నుంచి రూ.102కు పెంచనుంది. అంటే లీటర్‌పై రూ.9 పెరుగుదల. ఈ ధరలు 2027 ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటాయి. టోకు ధర పెరగడంతో వినియోగదా రులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం సుమారు రూ.100కు లభిస్తున్న ఈ పాలు.. కొత్త ధరల అమలుతో రిటైల్ మార్కెట్‌లో లీటర్‌కు దాదాపు రూ.110 వరకు చేరొచ్చని పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

**ఎందుకు పెంచారంటే..**

పశువుల పెంపకం, పాల ఉత్పత్తికి సంబంధించిన ఖర్చులు భారీగా పెరగడమే ధరల సవరణకు ప్రధాన కారణమని అసోసియేషన్ వెల్లడించింది. పశుదాణాలో ఉపయోగించే ధాన్యాలు, చుని, శనగ చుని, మొక్కజొన్న, నూనెగింజల పిండి (ఆయిల్ కేక్స్), పచ్చి గడ్డి వంటి వాటి ధరలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. కొన్ని దాణా పదార్థాల ధరలు ఏడాది వ్యవధిలో దాదాపు 25 శాతం వరకు పెరిగినట్లు అసోసియేషన్ పేర్కొంది. పశువుల నిర్వహణ, రవాణా తదితర ఖర్చులు కూడా పెరగడంతో పాత ధరలకు పాలు విక్రయించడం కష్టంగా మారిందని తెలిపింది.

**పండుగల వేళ మరింత భారం**

సెప్టెంబర్‌లో గణేశ్ చతుర్థి సహా పండుగల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ధరల పెంపు రావడం గమనార్హం. ఈ సమయంలో పాలు, పెరుగు, స్వీట్లు, లస్సీ, ఇతర పాల ఉత్పత్తులకు డిమాండ్ సాధారణంగా పెరుగుతుంది. దీంతో పాలు మాత్రమే కాకుండా పాల ఆధారిత ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.



# డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసం.. జింబాబ్వేపై సౌతాఫ్రికా ఘన విజయం

పసికూన నమీబియా ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న సౌతాఫ్రికా టీ20 ట్రై సిరీస్‌లో బోణీ కొట్టింది. శనివారం విండ్‌హోక్ వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. జింబాబ్వే విధించిన 145 పరుగుల టార్గెట్‌ను సఫారీలు 13.4 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. డెవాల్డ్ బ్రెవిస్ (32 బంతుల్లో 75 నాటౌట్, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసం సృష్టించి ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించాడు. ఓపెనర్లు ప్రిటోరియస్ (22), జోర్డాన్ హెర్మన్ (20) పర్వాలేదనిపించారు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవన్స్, బ్లెసింగ్ ముజరబానీ, నైమురి తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకముందు జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (34) టాప్ స్కోరర్ కాగా, మరుమనీ (13 బంతుల్లో 30, ఒక ఫోర్, మూడు సిక్సర్లు) ఆఖర్లో మెరవడంతో జింబాబ్వే గౌరవప్రదమైన స్కోరును సాధించింది. సౌతాఫ్రికా బౌలర్లలో డాన్ జాసెన్ 3 వికెట్లు తీయగా, సుబ్రయెన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో సౌతాఫ్రికా సిరీస్‌లో బోణీ కొట్టగా, తర్వాతి మ్యాచ్ సోమవారం జింబాబ్వే, నమీబియా మధ్య జరగనుంది.



# వైభవ్ సూర్యవంశీకి నో ఛాన్స్.. టీమిండియా నుంచి ఆ ఇద్దరికే చోటు!

టీమిండియా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ దినేష్ కార్తీక్ ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో టాప్ 5 ఆల్–ఫార్మాట్ ప్లేయర్లను ఎంచుకున్నాడు. ఈ జాబితాలో భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు అగ్రస్థానం దక్కింది. ఆ తర్వాత రెండో స్థానంలో ఆసీస్ స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు కార్తీక్ ఛాన్స్ ఇచ్చాడు. మూడు, నాలుగు స్థానాల్లో హ్యారీ బ్రూక్(ఇంగ్లండ్), యశస్వి జైశ్వాల్(భారత్)కు చోటు దక్కింది. చివరగా ఐదో స్థానంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రకు డీకే అవకాశమిచ్చాడు. కాగా టాప్ ప్లేస్‌లో ఉన్న శుబ్‌మన్ గిల్ గత కొంత కాలంగా వన్డే, టెస్టుల్లోనూ నిలకడగా రాణిస్తున్నాడు. భారత టీ20 జట్టుకు అతడు దూరంగా ఉన్నప్పటికి ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ లీగ్స్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ కారణంగానే గిల్‌ను ఆల్‌ఫార్మాట్ ప్లేయర్‌గా కార్తీక్ ఎంపిక చేశాడు. ట్రావిస్ హెడ్ కూడా మూడు ఫార్మాట్లలోనూ ఆసీస్‌కు కీలక ప్లేయర్‌గా మారాడు. తన దూకుడు బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసే సత్తా అతడిది. ఇక ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా వన్డే, టీ20లతో పాటు టెస్టుల్లో కూడా మ్యాచ్ విన్నింగ్ నాక్స్ ఆడుతున్నాడు. ప్రస్తుతం పాక్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లోనూ దుమ్ములేపుతున్నాడు. అయితే యశస్వి జైశ్వాల్, రచిన్ రవీంద్రలు మాత్రం గత కొంతకాలంగా తమస్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతు న్నారు. అయినప్పటికి డికే వారికి బెస్ట్ ఆల్ ఫార్మాట్ ప్లేయర్ల జాబితాలో అవకాశమిచ్చాడు. కాగా ఈ లిస్ట్‌లో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు ఇచ్చి ఉంటే బాగుండేది అని క్రికెట్ ఫ్యాన్స్ అభిప్రాయ పడుతున్నారు. ఎందుకంటే 15 ఏళ్ల వైభవ్ ఇప్పటికే టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లలో తన సత్తాను నిరూపించుకున్నాడు. అయితే వైభవ్ ఇంకా భారత జట్టు తరపున టెస్టు, వన్డే డెబ్యూ చేయనుందున కార్తీక్ ఈ లిస్ట్‌లో చోటు ఇవ్వలేదు.





స్పోర్ట్స్

## టీమిండియాకు గుడ్ న్యూస్.. యార్కర్ల కింగ్ వచ్చేస్తున్నాడు!



అఫ్గానిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. జింబాబ్వే పర్యటనలో గాయపడ్డ యువ ఫాస్ట్ బౌలర్, యార్కర్ల కింగ్ ప్రిన్స్ యాదవ్.. తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు తెలుస్తోంది. ఆజ్ తక్ కథనం ప్రకారం.. ప్రిన్స్ యాదవ్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తన ఫిట్‌నెస్ పరీక్షలను క్లియర్ చేసినట్లు సమాచారం. తద్వారా అఫ్గాన్‌తో సిరీస్ కోసం భారత జట్టు ఎంపికకు ప్రిన్స్ అందుబాటులో ఉండనున్నాడు. సెప్టెంబర్ 13 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది.

**ప్రిన్స్‌కు ఏమైందంటే?**

హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో బౌలింగ్ చేస్తుండగా ప్రిన్స్ యాదవ్ తొడ కండరాలు పట్టేశాయి. దీంతో 2.2 ఓవర్లు బౌలింగ్ చేసి ఆట మధ్యలోనే మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత మూడో టీ20కు అతడు దూరమయ్యాడు. అనంతరం ఈ ఢిల్లీ పేసర్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌లో చేరి తన ఫిట్‌నెస్‌ను తిరిగి పొందాడు. కాగా ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. దీంతో భారత సీనియర్ జట్టు సెలక్టర్ల నుంచి అతడికి పిలుపువచ్చింది. తనకు లభించిన అవకాశాన్ని ప్రిన్స్ రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. ఇప్పటివరకు భారత తరపున 3 వన్డేలు, 6 టీ20లు ఆడిన ప్రిన్స్ యాదవ్.. మొత్తంగా 13 వికెట్లు పడగొట్టాడు.ఇప్పుడు ఈ రైట్ ఆర్మ్ పేసర్ అఫ్గానిస్తాన్‌పై సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నాడు.

# కింగ్ 100 గ్లింప్స్ విడుదల.. పవర్ ఫుల్ డైలాగ్‌తో హీరో పరిచయం




అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్ధమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్ధమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్–టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.



# ఆగని 'ఇరుముడి' జోరు.. ఇప్పటివరకు కలెక్షన్స్ ఎంతంటే?

చీకటి తర్వాత వెలుగు రావడం ఎంత సహజమో.. వరుస పరాజయాల తర్వాత ఓ విజయం పలకరించడం కూడా అంతే సహజమని మరోసారి నిరూపించాడు మాస్ మహారాజా రవితేజ. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ హీరోకు ఎట్టకేలకు 'ఇరుముడి'తో హిట్ దొరికింది. అది కూడా మాములు హిట్ కాదు.. బ్లాక్ బస్టర్.సినిమా రిలీజై వారం రోజులు గడిచినా ఇప్పటికే ప్రేక్షకులు ఈ సినిమా కోసం థియేటర్స్‌కి పోటెత్తున్నారు. దీంతో కలెక్షన్స్ కూడా భారీగా పెరిగిపోతున్నాయి. సినిమా రిలీజ్ అయిన నాలుగు రోజుల్లో ఏకంగా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఇక ఇప్పుడు రూ.150 కోట్ల క్లబ్‌లో చేరింది. ఇప్పటి వరకు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

**అప్పుడెప్పుడో రూ. 100 కోట్లు..**

రవితేజ ఖాతాలో రూ. 100 కోట్ల వసూళ్ల సినిమా పడి చాలా కాలమైంది. 2022లో వచ్చిన ధమాకా ఒక్కటే సెంచరీ కొట్టింది. ఆ తర్వాత చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడ్డాయి. ఈ నాలుగేళ్లలో ఆయన 6 సినిమాలు చేస్తే.. వాటిలో ఏ ఒక్కటి కూడా హిట్ టాక్‌ని సంపాదించుకోలేదు. కొన్ని సినిమాలు అయితే కనీసం రూ. 10 కోట్ల వసూళ్లను రాబట్టలేదు. చాలా కాలం తర్వాత ఇప్పుడు ఇరుముడితో హిట్ కొట్టి.. పాత లెక్కలన్నీ సరిచేశాడు. మరి ఇకపై ఈ మాస్ మహారాజ సినీ జర్నీ ఎలా ఉంటుందో చూడాలి.

# ఓటీటీలోకి మలయాళ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్.. ఇదేం ట్విస్టులు సామి!



ప్రేక్షకులందు సినిమా ప్రేక్షకులు వేరయా...అది ఆటైనా, పాటైనా ...వేడుకేదైనా, వేదికేదైనా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా కార్యక్రమం రూపుదిద్దుకుంటే మాత్రం చాలు ఆ కార్యక్రమం విజయవంతమైనట్లే. కాని సినిమా ప్రేక్షకులు మాత్రం వీటన్నిటికీ విభిన్నం. విషయాన్ని సూటిగా చెబితే సినీ ప్రేక్షకులు అలరించరు. అదే విషయానికి కాస్త మసాలా దట్టించి చెప్పాలనుకున్న విషయాన్ని వినూత్నంగా చివరాఖరిలో చెబితేనే సినిమా అలరిస్తుంది. మరీ ముఖ్యంగా ఇప్పటితరం వైవిధ్యానికి పెద్ద పీట వేస్తోంది.ఆ నేపథ్యంలో వచ్చిన సినిమా ఉయిర్. ప్రముఖ ఓటీటీ సంస్థ జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇదో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇది మళయాళ సినిమా అయినా హాట్ స్టార్ లో తెలుగులోనూ లభ్యమవుతోంది. ప్రముఖ మళయాళ రచయితలు షాజీ, నిఖిల్ రాసిన కథకు పద్మకుమార్ ప్రాణం పోసిన సినిమానే ఉయిర్. ఈ సినిమా ప్రారంభం నుండి శుభం కార్డు వరకు ప్రేక్షకుడిలో ఆమితాసక్తిని రేకెత్తిస్తూ ఆఖరి సన్నివేశం వరకూ ఉత్కంఠ రేపుతుంది. అంతలా ఈ సినిమా కథలో ఏముందో ఓ సారి చూద్దాం. కేరళలోని కన్నూర్ సమీప ప్రాంతంలో ఉన్న ఓ పాడుబడిన బావిలో కుళ్ళిపోయిన స్థితిలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం బయటపడటంతో కథ ప్రారంభమవుతుంది. కొత్తగా విధుల్లో చేరిన సబ్‌ఇన్‌స్పెక్టర్ అజీబ్‌కు ఈ కేసు దర్యాప్తు బాధ్యత అప్పగిస్తారు. సీనియర్ పోలీస్ ఆఫీసర్ జాయ్ పర్యవేక్షణలో అజీబ్ తన మొదటి పెద్ద కేసుగా దీన్ని తీసుకుంటాడు. ప్రారంభంలో ఎలాంటి క్లూస్ దొరకకపోయినా, ఆ శవం వేసుకోనున్న బట్టలు, చేతి గాజుల ఆధారంగా ఆ మహిళ కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిన వలస కార్మికురాలు 'శోభ' అని గుర్తిస్తారు.విచారణ ముందుకెళ్ళేకొద్దీ ఇది సాధారణ హత్య కాదని దీని వెనుక పెద్ద మోసపూరిత కుట్ర దాగుందని అజీబ్ కు అర్ధమవుతుంది. శోభ హత్య సమయంలో తప్పిపోయిన శోభ పిల్లల గురించి అజీబ్ ఆరా తీస్తుంటాడు. మరో వైపు అజీబ్‌కు చిన్నతనంలోనే తన సొంత చెల్లెలు తప్పిపోయిన చేదు జ్ఞాపకం నిరంతరం వెంటాడుతూ ఉంటుంది. దానికి ఈ హత్యకు ఓ లింకు కూడా ఉంటుంది. మరి శోభను హత్య చేసిన అసలు నేరస్థుడిని అలాగే శోభ పిల్లలను అజీబ్ వెతికి పట్టుకుంటాడా లేదా అన్నది మాత్రం ఉయిర్ సినిమాలోనే చూడాలి. ఈ సినిమా స్క్రీన్ ప్లే మాత్రం ఊహకందని రీతిలో పరిగెడుతుంది. మస్ట్ వాచ్ థ్రిల్లర్ ఫర్ ది వీకెండ్.




# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'లో అదిరిపోయే సర్‌ప్రైజ్.. ఆ పాటని రీమిక్స్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న సినిమా కావడంతో వెంకీ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ముందుగా అనుకున్న సమయానికి విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని అనుకోని కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం మేకర్స్ సినిమాను అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకటేష్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'కూలీ నెం.1' చిత్రంలోని సూపర్ హిట్ పాట 'దండాలయ్య ఉండ్రాలయ్య'ను 'ఆదర్శ కుటుంబం' కోసం కొత్తగా రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. 'కూలీ నెం.1' సినిమాలో వెంకటేష్‌పై చిత్రీకరించిన 'దండాలయ్య ఉండ్రాలయ్య' పాట ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా వినాయక చవితి సమయంలో గణేష్ మండపాల వద్ద ఈ పాట వినిపిస్తూనే ఉంటుంది. తరతరాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఈ పాటకు ఇప్పటికీ ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పుడు అదే చార్ట్‌బస్టర్ పాటను 'ఆదర్శ కుటుంబం' కోసం రీమిక్స్ చేయనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. త్రివిక్రమ్ తనదైన శైలిలో ఈ పాటను ఎలా ప్రెజెంట్ చేస్తారు? అసలు కథలో ఈ పాటను ఏ సందర్భంలో ఉపయోగించబోతున్నారు? అనే అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. పాత పాటలోని మ్యాజిక్‌ను అలాగే ఉంచుతూ, కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా సరికొత్త మ్యూజిక్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ రీమిక్స్‌ను రూపొందించే అవకాశం ఉందని టాక్. ముఖ్యంగా వెంకటేష్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ సాంగ్ వస్తే థియేటర్లలో మంచి సందడి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన అందాల భామ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. వెంకటేష్‌తో ఆమె కాంబినేషన్ ప్రేక్షకులకు కొత్తగా ఉండబోతోంది. ఇప్పటికే పలు చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి.. ఈ సినిమాలో కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ మార్క్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌కు శ్రీనిధి పాత్ర ఎలా తోడ్పడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# కీర్తి సురేష్‌తో కలిసి నాని మాస్ స్టెప్పులు

## 'యెష నాగుల కట్ట మీద' లిరికల్ వీడియో సాంగ్ రిలీజ్




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ మరో అదిరిపోయే మాస్ అప్‌డేట్ ఇచ్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి "యెష నాగుల కట్ట మీద.. యేసె ఉయ్యాల" సాంగ్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా లిరికల్ వీడియోను వదిలింది. పూర్తి లిరికల్ వీడియో సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అచ్చమైన తెలంగాణ జానపద బాణీలో సాగే ఈ పాటలో కీర్తి సురేష్ స్పెషల్ అప్పీరెన్స్ ఇచ్చి నానితో కలిసి ఊరమాస్ స్టెప్పులతో అదరగొట్టారు. కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం ఈ పాటకు మరింత ఊపునివ్వగా, జంగి రెడ్డి, ప్రభా తమ శక్తివంతమైన గొంతుతో పాడి ప్రాణం పోశారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఈ సాంగ్ ద్వారా అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయి. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512